ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
విశాఖపట్నం
జిల్లా వార్తలు
సోమవారం 7 అక్టోబరు 2024



సౌకర్యాల్లో రాజీ కూడదు

పబ్లిక్, ప్రైవేటు, పీపుల్స్ భాగస్వామ్యంతో పర్యాటక రంగం అభివృద్ధి

- పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖా మంత్రి కందుల దుర్గేష్



తెన్నేటిపార్కును పరిశీలిస్తున్న మంత్రి దుర్గేష్

విశాఖపట్నం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): పర్యాటక ప్రాంతాల్లో కల్పించే మౌలిక వసతులు, సౌకర్యాల్లో రాజీ పడొద్దని పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖా మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో పర్యాటకాభివృద్ధి సంస్థ చేపట్టిన అభివృద్ధి కార్యక్ర మాలను ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ సీజన్‌లో పర్యాటకుల రద్దీ ఉంటుందని, ఆయా ప్రాంతాల్లో కల్పించాల్సిన సౌకర్యాలపై దృష్టి సారించాలని సూచించారు. పున్నమతి, యాత్రీ నివాస్, హరిత రిసార్ట్‌లో ఆధునికీకరణ పనులపై అధికారులకు పలు సూచన లిచ్చారు. ప్రభుత్వ ఆదాయం కోల్పోకుండా త్వరితగతిన పను లు పూర్తిచేయాలని ఆదేశించారు. గత ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలు, అక్రమాలతో హరిత రిసార్ట్స్, పున్నమతి యాత్రీ నివాస్ పనులు ఇప్పటికీ పూర్తి కాలేదన్నారు. పర్యాటకా భివృద్ధి సంస్థలో రూ.8.60 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన వివిధ ఆధునికీకరణ పనుల్లో 90 శాతం నిధులు ఖర్చు చేసి నప్పటికీ అదనంగా మరో నాలుగు కోట్లు అవసరమవుతున్నాయన్నారు. అనంతరం తెన్నేటి పార్కును పరిశీలించిన ఆయ న పర్యాటక బ్రోచర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పర్యా టకశాఖకు చెందిన పలువురు అధికారులు పాల్గొన్నారు.

ధైర్యలక్ష్మిగా కనకమహాలక్ష్మి



శరన్నవరాత్రుల సందర్భంగా పాతనగరం బురుజుపేటలోని శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారు ఆదివారం ధైర్యలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా తులసి దళాలతో ప్రత్యేక పూజలు చేశారు. పట్టుచీర, ఆభరణాలు, పూలమాలలతో మూలవిరాట్‌ను అత్యంత సుందరంగా అలంకరించి భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించారు. ఈవో కె.శోభారాణి, అధికారులు అమ్మవారి పూజల్లో పాల్గొన్నారు. కాగా సోమవారం అమ్మవారు సంతాన లక్ష్మిగా దర్శనమివ్వనున్నారు.

- జగదాంబ కూడలి

ప్రీ పీహెచ్‌డీ పరీక్షలపై గందరగోళం



ఏయూ టీడీఆర్ హబ్‌లో చేరిన అభ్యర్థుల నిరీక్షణ

- ఎన్నికల కారణంగా మార్చిలో జరగాల్సిన పరీక్షలు వాయిదా
- ప్రభుత్వ మార్పుతో వర్సిటీకి నూతన అధికారులు
- పరీక్షల నిర్వహణపై కనిపించని చర్యలు

విశాఖపట్నం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని ట్రాన్స్ డిసిప్లినరీ రీసెర్చ్ (టీడీఆర్) హబ్‌లో చేరిన వందలాది మంది పరిశోధక విద్యార్థులకు ప్రీ పీహెచ్‌డీ పరీక్షల నిర్వహణను అధికారులు వాయిదా వేస్తూ వస్తున్నారు. ఈ హబ్ ఆధ్వర్యంలో చేపట్టే పార్ట్‌టైమ్, ఎగ్జిక్యూటివ్ పీహెచ్‌డీల్లో వందలాది మంది అభ్యర్థులు చేరారు. వీరిలో సుమారు 400 మందికి ప్రీ పీహెచ్‌డీ పరీక్షలను ఈ ఏడాదిలో నిర్వహించాల్సి ఉంది. అప్పట్లో ఎన్నికలకు షెడ్యూల్ విడుదల కావడం, ఇతర సాంకేతిక కారణాలతో నిర్వహించలేదు. ఆ తరువాత కూటమి ప్రభుత్వం ఏర్పాటు కావడం, వర్సిటీకి కొత్త అధికారుల నియామకంతో ఈ ప్రక్రియ పూర్తిగా నిలిచిపోయింది. దీంతో పరీక్షలకు సిద్ధమైన 400 మందికిపైగా పరిశోధక అభ్యర్థులు నిరీక్షించాల్సిన దుస్థితి నెలకొంది. అయితే ఇప్పటికే తీవ్ర జాప్యం జరిగిందని, వచ్చే ఏడాది మార్చినాటికి మూడేళ్లు పూర్తవుతుందని వాపోతున్నారు. పరీక్షలు పూర్తైతే తదుపరి ప్రక్రియపై దృష్టిసారించాల్సి ఉంటుందంటున్నారు. ప్రీ పీహెచ్‌డీ పరీక్షల అనంతరం కూపస్ జర్నల్స్‌లో పబ్లికేషన్స్, ఆ తరువాత థీసెస్ సబ్‌మిషన్‌కు మరింత సమయం పడుతుందని చెబుతున్నారు. పరీక్షల కోసం ఎదురుచూస్తున్న పరిశోధక విద్యార్థుల ఇబ్బందులను గుర్తించి చర్యలు తీసుకునేలా ఆదేశాలు జారీచేయాలని కోరుతున్నారు. పరీక్షలు నిర్వహించకపోవడంతో విద్యార్థులు గైడ్లు చుట్టూ తిరుగుతూ వర్సిటీ ఉన్నతాధికారులకు ... మిగతా 6వ పేజీలో

జిల్లాకు కొత్తగా 27 ఇసుక రీచ్‌లు

ఈనెల 15 తరువాత పెరగనున్న సరఫరా

- రోజుకు మూడువేల టన్నుల డిమాండ్
- కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్, చిత్రంలో సీపీ శంఖబ్రత బాగ్చి, జేసీ మయూర్ అశోక్ ఉన్నారు.

విశాఖపట్నం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా అవసరాల మేరకు కొత్తగా తూర్పుగోదావరి, విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాలో 27 ఇసుక రీచ్‌లను ప్రభుత్వం కేటాయించిందని కలెక్టర్ ఎంఎన్. హరేంధిర ప్రసాద్ తెలిపారు. ప్రస్తుతం నాలుగు జిల్లాల్లో నాలుగు రీచ్‌ల నుంచి నగరానికి ఇసుక వస్తోందన్నారు. ఆదివారం కలెక్టరేట్‌లో సీపీ శంఖబ్రత బాగ్చి , జేసీ మయూర్ అశోక్‌తో కలిసి ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... నదుల్లో వరద తగ్గడంతో రాష్ట్రంలో అన్ని జిల్లాలకు కలిపి కొత్తగా 108 రీచ్‌లను గుర్తించగా, జిల్లాకు 27 కేటాయించారన్నారు. ఈనెల 15 నుంచి ఆయా రీచ్‌లలో ఇసుక తవ్వకాలు ప్రారంభమవుతాయని, దీంతో నగరానికి సరఫరా పెరుగుతుందన్నారు. జిల్లాలో రోజుకు మూడు నుంచి మూడున్నర వేల టన్నుల ఇసుక అవసరమన్నారు. జిల్లాలో ఇసుక రీచ్‌లు లేనందున పొరుగు జిల్లాలపై ఆధారపడుతున్నామన్నారు. ప్రభుత్వ విధానాల మేరకు ఉచితంగానే ఇసుక సరఫరా చేస్తున్నామని, అయితే రవాణా, రీచ్‌లలో ఇసుక తవ్వకాలకు సంబంధించి ఆపరేషన్ చార్జీలు మినహా ఎటువంటి రుసుం వసూలు చేయడం లేదన్నారు. పాలసీకి విరుద్ధంగా ఎవరు వ్యవహరించినా, అక్రమాలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గతనెల 20నుంచి ఆన్‌లైన్‌లో ఇసుక బుకింగ్ ప్రక్రియ అందుబాటులోకి వచ్చిందని, ఇప్పటివరకు 442 బుకింగ్ ఆర్డర్లు జరగ్గా 357 బుకింగ్‌లకు ఏడు వేల టన్నులు సరఫరాచేశామన్నారు. బిల్డర్లు, రియల్‌ఎస్టేట్ డెవలపర్ల నుంచి 103 బల్క్ ఆర్డర్లకు బుకింగ్‌లు వచ్చినా, సాంకేతిక సమస్యతో ఇబ్బందులు ఎదురయ్యాయని, రెండు మూడు రోజుల్లో పరిష్కరిస్తామన్నారు.

ప్రభుత్వం నిర్ణయించిన వాహనంలో వినియోగదారుడి ఇంటికి ఇసుక సరఫరా చేయడం, లేదా వినియోగదారుడు సొంతంగా వాహనం సమకూర్చుకుని రీచ్‌కు వెళ్లి ఆపరేషన్ చార్జీలు చెల్లించి తీసుకునే విధానం అమల్లో ఉందన్నారు. ధవళేశ్వరం నుంచి కూర్మన్నపాలేనికి 190 కి.మీ. దూరం ఉందని, 20 మెట్రిక్ టన్నుల ఇసుక తెచ్చుకునేందుకు రూ.19వేలు రవాణా చెల్లించామని, ఆపరేషన్ చార్జీలతో కలిపితే టన్ను ధర రూ.1300 నుంచి రూ.1350 పడినట్టు ఓ వినియోగదారుడు చెప్పారన్నారు. శ్రీకాకుళం జిల్ల ఖండ్యాం నుంచి ఇసుక తెచ్చుకుంటే రూ.1267కు పడిందని మరో వినియోగదారుడు తెలిపారన్నారు.మూడుటన్నులకంటే తక్కువ ఇసుక అవసరమయ్యే వారికి నగరంలో డిపోలు అందుబాటులో లేవన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం త్వరలో నిర్ణయం తీసుకుంటుందన్నారు.

అక్రమాలకు పాల్పడితే రెండేళ్లు జైలు

ఇసుక అక్రమంగా తరలించినా, నిల్వ ఉంచినా రెండేళ్ల వరకు జైలు, జరిమానా విధిస్తామని కలెక్టర్ హెచ్చరించారు. నిఘా కోసం రెవెన్యూ, పోలీస్, గనులు, పంచాయతీరాజ్, జలవనరుల శాఖ అధికారులతో టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేశామన్నారు. మొదటి రెండు తప్పులకు జరిమానా ఉంటుందని, మూడో తప్పునకు జైలు శిక్ష పడుతుందన్నారు. ఇసుక అక్రమాలపై కలెక్టరేట్‌లో 0891-2590100కు ఫోన్ చేయాలన్నారు.

ఆగని గ్రావెల్ దందా



ప్రభుత్వం మారినా చర్యల్లేవ్

- పారిశ్రామిక లేఅవుట్ చదునుకు గ్రావెల్ తరలింపు
- ఏపీఐఐసీ సిబ్బందితో కలిసి స్థానిక నేతల అక్రమాలు
- తర్లువాడ, గుడిజాల, శొంఠ్యాంలో మట్టి తవ్వకాలు

పెందుర్తి మండలం గుర్రంపాలెం పారిశ్రామిక లేఅవుట్‌కు ఆనుకుని కొండను తవ్వేసిన దృశ్యం

విశాఖపట్నం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో యథేచ్ఛగా కొండలు తవ్వేసిన ముఠాలు జిల్లాలో ఇంకా దందా కొనసాగిస్తూనే ఉన్నాయి. వీటిపై అధికారులు సీరియస్‌గా వ్యవహరించకపోవడంతో అక్రమార్కులు బరితెగిస్తున్నారు. పెందుర్తి, ఆనందపురం మండలాల్లో ఇటీవల గ్రావెల్, మట్టి దందాలు మరింత జోరందుకున్నాయి. పెందుర్తి మండలం గుర్రంపాలెం పారిశ్రామిక వాడలో ప్లాట్లు కొనుగోలు చేసిన పలువురు వ్యాపారులు తమకు కేటాయించిన స్థలాలను ఫిల్లింగ్ చేయడానికి కొందరు బ్రోకర్లపై ఆధారపడుతున్నారు. దీనికి ఏపీఐఐసీలో కొందరు అధికారులు, సిబ్బంది, కిందిస్థాయి రెవెన్యూ సిబ్బంది దన్నుగా నిలిచారు. దీంతో ఎన్నికల సమయంలో ఏపీఐఐసీకి చెందిన కొండను తవ్వి తరలించుకుపోయారు. దీనిపై వచ్చిన ఫిర్యాదుల మేరకు ఏపీఐఐసీ సిబ్బంది కొందరు సక్రమంగా స్పందించలేదు. సరికదా ప్లాట్ల యజమానుల నుంచి సొమ్ము వసూలు చేశారన్న ఆరోపణలున్నాయి. చివరకు గనులు, రెవెన్యూశాఖలు కూడా తమకెందుకు అన్నట్టుగా వ్యవహరించడంతో రెచ్చిపోయిన అక్రమార్కులు లేఅవుట్‌కు ఉత్తరాన ఉన్న కొండను కొద్ది రోజులుగా రాత్రింబవళ్లు తవ్వి గ్రావెల్ తరలిస్తున్నారు. ఇప్పటివరకు ఒక పథకం మేరకు సుమారు ఐదెకరాల విస్తీర్ణంలో కొండవాలును తవ్వేశారు. సమీపంలో ఉన్న ప్లాట్లను ఫిల్లింగ్ చేయడానికి వందల టిప్పర్ల ద్వారా గ్రావెల్ తరలించుకుపోయారు. మరికొంత సమీపంలోని ప్రైవేటు వ్యక్తుల లేఅవుట్‌లకు కూడా రవాణాచేశారు. అయినా రెవెన్యూ, గనుల శాఖ అధికారులు, సిబ్బంది కన్నెత్తి చూడకపోవడంతో అక్రమార్కులకు మరింత ధైర్యం వచ్చింది. దీంతో వేల క్యూబిక్ మీటర్ల గ్రావెల్ తవ్వేసి అమ్ముకున్నారు. నిబంధనల మేరకు గనుల శాఖకు దరఖాస్తుచేసి తాత్కాలిక పర్మిట్లు తీసుకుని క్యూబిక్ మీటరుకు రూ.90 చొప్పున రాయల్టీ వసేలు చేయాలి. అయితే అక్రమార్కులు కూటమి నాయకులను మచ్చిక చేసుకుని, దర్జాగా గ్రావెల్ దందా కొనసాగిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.



పద్మనాభం మండలం పాండ్రంగి వద్ద గోస్తని నదిపై కాజ్‌వే

మళ్లీ మొదటికి?

పాండ్రంగి వంతెన టెండరు రద్దు

కొత్తరేట్ల ప్రకారం రూ.17 కోట్లకు చేరే అవకాశం

విశాఖపట్నం/పద్మనాభం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి):

గోస్తనీ నదిపై పద్మనాభం మండలం పాండ్రంగి వద్ద రూ. 14 కోట్లతో చేపట్టాల్సిన వంతెన నిర్మాణ పనుల టెండరు రద్దయింది. ఇప్పటివరకు పనులు ప్రారంభించని, 25 శాతం కంటే తక్కువ జరిగిన పనుల టెండర్లను ప్రభుత్వం రద్దుచేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. దీంతో పాండ్రంగి వంతెన నిర్మాణం కథ మళ్లీ మొదటకొచ్చింది.

సుమారు 22 ఏళ్ల క్రితం అంటే 2002లో రూ.1.5 కోట్లతో వంతెన నిర్మాణానికి పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ ప్రతిపాదించింది. చివరకు టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ. 11 కోట్లతో వంతెన నిర్మాణానికి 2018లో అప్పటి మంత్రి గంటా శ్రీనివాసరావు శంకుస్థాపన చేశారు. తరువాత ప్రభుత్వం మారడంతో మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు ప్రతిపాదనలను రూ.14 కోట్లకు పెంచి మళ్లీ శంకుస్థాపన ... మిగతా 6వ పేజీలో

రూ.86.24 లక్షల చోరీ సొత్తు రికవరీ

77 కేసుల్లో 71 మంది అరెస్టు

- సీపీ శంఖబ్రత బాగ్చి



రికవరీ చేసిన సొత్తును పరిశీలిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి

విశాఖపట్నం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): నగరంలో గతనెలలో నమోదైన చోరీ కేసుల్లో 77 కేసులను ఛేదించిన పోలీసులు 71 మంది నిందితులను అరెస్టు చేశారు. వారి నుంచి రూ.86.24 లక్షల విలువైన సొత్తును రికవరీ చేశారు. పోలీస్ కమిషనరేట్ ఆవరణలోని 'టెంపుల్ ఆఫ్ లెర్నింగ్ హాల్‌లో ఆదివారం 'క్రైం రికవరీ మేళా' నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ శంఖబ్రత బాగ్చి మాట్లాడుతూ సెప్టెంబరులో నగరంలో 105 చోరీ కేసులు నమోదవగా, 77 కేసులను ఛేదించామన్నారు. ఇందులో మాధవస్వామి ఆలయం చోరీ కేసుతో పాటు దారిదోపిడీ, నాలుగిళ్లలో పగటిపూట చోరీలు, 13 రాత్రి చోరీలు, తొమ్మిది చైన్ స్నాచింగ్‌లు, ఆటో చోరీ, 23 ద్విచక్రవాహనాలు, 26 ఇతర దొంగతనాలున్నాయన్నారు. చోరీలకు పాల్పడిన 71 మంది నిందితులను అరెస్టు చేసి వారి నుంచి 1.2 కిలోల బంగారం, 943 గ్రాముల వెండి, రూ.1.54 లక్షల నగదు, 25 మోటార్‌సైకిళ్లు, ఒక ఆటో, ఒక కారు, 287 సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్, రాగివైరు 30 కేజీలు మొత్తం రూ.86,24,850 విలువ చేసే సొత్తుని స్వాధీనం చేసుకున్నామన్నారు.

ఈ ఏడాది ఆగస్టులో పలుచోరీ కేసులను ఛేదించి రూ.60 లక్షల విలువైన సొత్తురికవరీ చేయగా సెప్టెంబరులో రూ.86.24 లక్షల సొత్తుని రికవరీ చేసిన క్రైమ్ విభాగం అధికారులు, సిబ్బందిని సీపీ అభినందించారు.

బాధితులకు అప్పగింత

చోరీ కేసుల్లో రికవరీ చేసిన బంగారం, వెండి ఆభరణాలతోపాటు నగదు, ఆటో, కారు, ద్విచక్ర వాహనాలు, సెల్‌ఫోన్లను సీపీ బాధితులకు అప్పగించారు. ఈ సొత్తుని కోర్టులో పెట్టకుండానే బాధితులకు అందజేసే కార్యక్రమానికి తొలిసారిగా శ్రీకారం ... మిగతా 6వ పేజీలో

ఎలుగెత్తిన కార్మిక లోకం

స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ నిరసన

- జాతీయ రహదారిపై మానవహారం, రాస్తారోకో
- ఉక్కును సెయిల్‌లో విలీనం చేయాలని డిమాండ్
- కార్మిక సంఘాల నేతలను అరెస్టు చేసిన పోలీసులు



వడ్లపూడిలో రాస్తారోకో చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

కూర్మన్నపాలెం, అక్టోబరు 6: ఉక్కు కర్మాగారాన్ని పూర్తిస్థాయి సామర్థ్యంతో నడపాలని, సెయిల్‌లో విలీనం చేయాలని డిమాండ్ చేస్తూ విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం జాతీయ రహదారిపై మానవహారం, రాస్తారోకో నిర్వహించారు. గాజువాక నుంచి అగనంపూడి వరకూ ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు వేలాది మంది కార్మికులతో మానవహారం నిర్వహించారు. అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం జంక్షన్‌లో రహదారులను దిగ్బంధించారు. ప్లకార్డులు, బ్యానర్లు చేత పట్టుకొని రహదారిపై బైఠాయించారు. దీంతో వాహన రాకపోకలు ... మిగతా 6వ పేజీలో



ఈడీ (వర్క్స్) కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న ఉక్కు ఉద్యోగులు

తెల్లవారుజాము వరకు ఆగని ఆందోళన

- నేడూ కొనసాగిస్తామన్న ఉక్కు ఉద్యోగులు

-6లో

వేడుక ఏదైనా..
సందర్భం ఎటువంటిదైనా
- వివాహ వార్షికోత్సవం
- స్వదేశీ, విదేశీయానం
- లీగల్ ప్రకటనలు
- పదవీ విరమణ
- శ్రద్ధాంజలి
- జన్మదినం
- షష్టిపూర్తి
- జయంతి
- వర్ధంతి
- క్లాసిఫైడ్స్

మీ స్నేహితులు, శ్రేయోభిలాషులు, కుటుంబ సభ్యులకు తక్కువ ఖర్చుతో ఆంధ్రజ్యోతిలో ప్రకటన ద్వారా శుభాకాంక్షలు తెలియజేయండి
ఆంధ్రజ్యోతి
ప్రకటనల కొరకు సంప్రదించండి
9985411659

బిడ్డకు జన్మనిచ్చిన మానసిక రోగి

అక్కయ్యపాలెం, అక్టోబరు 6: ఓ మానసిక రోగి (35) ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. రైల్వేస్టేషన్‌లో ఏయూటీడీ సంస్థ ప్రతినిధులు గతంలో ఒడిశాకు చెందిన మహిళా మానసిక రోగిని గుర్తించారు. ఆమెను ఆసుపత్రిలో చేర్చి తనిఖీ చేయించగా గర్భవతిగా తేలింది. ఈ ఏడాది జూన్ 8న టీఎస్సార్ కాంప్లెక్స్‌లోని నిరాశ్రయుల వసతిగృహంలో ఆమెకు ఆశ్రయం కల్పించినట్లు ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు. నెలలు నిండడంతో ఆగస్టు 20న కేజీహెచ్‌లో చేర్పించారు. గత నెల 19న వైద్యులు శస్త్రచికిత్స చేయగా పాపకు జన్మనిచ్చిందన్నారు. కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్, హెచ్ఓడీ డాక్టర్ ఉషారాణి, వైద్యుల సమక్షంలో ఏయూటీడీ సిబ్బందికి పాపను అప్పగించారు.

'మహిళల జీవనం మెరుగుపరుస్తాం'

మహారాణిపేట, అక్టోబరు 6: మహిళల జీవన నాణ్యతను మెరుగుపరచటమే హ్యూమనిటేరియన్ అసిస్టెన్స్ ట్రస్టు లక్ష్యమని డాక్టర్ ఎస్.శశిప్రభ అన్నారు. బ్రిడ్జ్‌స్టోన్ ఇండియా మొబిలిటీ సోషల్ ఇంపాక్ట్ అవార్డును-2024 గెలుచుకున్న సందర్భంగా మహారాణిపేటలో నిర్వహించిన సమావేశంలో డా.శశిప్రభ మాట్లాడుతూ మహిళలకు సాధికారత కల్పించటమే లక్ష్యంగా ట్రస్టు ద్వారా శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా మహిళలకు ఆర్థిక స్వావలంబన, లింగ సమానత్వం, స్వతంత్రత వస్తుందన్నారు.


శిథిలావస్థలో ఎంవీడీఎం పాఠశాల భవనం


తరగతిగది లోపలి భాగం దుస్థితి


అధ్వాన స్థితిలో మరుగుదొడ్లు

బడికెళితే సమస్యల పాఠాలేనా?

జగదాంబ కూడలి, అక్టోబరు 2: వన్‌టౌన్‌లో జీవీఎంసీ ఆధీనంలోని ఎంవీడీఎం ఉన్నత పాఠశాల విద్యార్థులు సమస్యల పాఠాలు వల్లెవేస్తున్నారు. ఐదేళ్లుగా ఈ బడి నిర్లక్ష్యపు నీడలో కొట్టుమిట్టాడుతోంది. వైసీపీ పాలకులు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదు. పాత లక్ష్మీటాకీస్ ప్రాంత పరిధిలోని పేద, మధ్య తరగతి విద్యార్థులు ఇందులో విద్యనభ్యసిస్తున్నారు. ప్రస్తుతం 6 నుంచి పదో తరగతి వరకు 750 మంది విద్యార్థులున్నారు. వీరికి 14 మంది ఉపాధ్యాయులు బోధిస్తున్నారు. మరో ఆరుగురు ఉపాధ్యాయులు అవసరం. దశాబ్దాల కిందట నిర్మించిన భవనాలు కావడంతో తరగతి గదుల్లో స్లాబ్‌లు పెచ్చులు విరిగిపడుతున్నాయి. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేసేందుకు ఆవరణలో ప్రత్యేకంగా గది లేకపోవడంతో వరండా, చెట్ల కిందకు వెళ్లాల్సి వస్తోంది. మరుగుదొడ్ల పరిస్థితి దారుణం. ప్రధానోపాధ్యాయుడు చొరవ తీసుకుని ఎప్పటికప్పుడు వాటిని బాగుచేయిస్తున్నారు. అధికారులు గత ఐదేళ్లలో ఒక్క రూపాయి కూడా పాఠశాల అవసరాలకు ఖర్చు చేయకపోవడం గమనార్హం.

మత్తు పదార్థాల ప్రభావం

పాఠశాల పరిసరాల్లో గంజాయి, ఇతర మత్తు పదార్థాల విక్రయం జోరుగా సాగడంతో ఆ ప్రభావం విద్యార్థులపై పడుతోంది. ఇక్కడి విద్యార్థుల్లో అత్యధిక శాతం మంది పేద, మధ్యతరగతి వర్గాల వారే. అందువల్ల ఇళ్లలో వీరిపై పర్యవేక్షణ తక్కువ. తల్లిదండ్రులు కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటారు. ఇవన్నీ విద్యార్థులు పెడమార్గం పట్టడానికి కారణమవుతున్నాయి. ఉపాధ్యాయులకు అనేక సమస్యలు ఎదురవుతున్నాయి. విద్యార్థులను సన్మార్గంలో పెట్టేందుకు ప్రత్యేక దృష్టి సారించాల్సి వస్తోంది. తరగతి గదుల్లోకి చాలామంది సెల్‌ఫోన్లు తీసుకువస్తున్నారు. గతంలో వీటిని నిరాకరించిన ఉపాధ్యాయుడితో వాగ్వాదానికి దిగిన సంఘటనలు ఉన్నాయి. మునుపటికంటే పాఠశాలలో చేరే విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది. అధికారులు, ప్రజాప్రతినిధులు పాఠశాలను సందర్శించి తగిన రక్షణ చర్యలు తీసుకుని కనీస వసతులు కల్పించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

'జీవితంలో ఎన్నో నేర్చుకోవాలి'


ఎస్వీ రామారావును సత్కరిస్తున్న నిర్వాహకులు

సీతమ్మధార, అక్టోబరు 6: ప్రతి వ్యక్తి జీవితంలో నేర్చుకోవాల్సిన అంశాలు ఎన్నో ఉంటాయని ప్రముఖ రచయిత ఎస్వీ రామారావు అన్నారు. లంకపల్లి బుల్లయ్య కళాశాలలోని గాంధీ సెంటర్ సెమినార్ హాలులో ఆదివారం వైజాగ్ ఫిల్మ్ సొసైటీ వార్షిక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రచయిత రామారావు మాట్లాడుతూ ప్రభావవంతమైన సినిమాలు ప్రేక్షకులకు చేరవేయడంలో వైజాగ్ ఫిల్మ్ సొసైటీ పాత్ర ఎంతో ఉందన్నారు. అనంతరం రామారావును నిర్వాహకులు సన్మానించారు. సొసైటీ ప్రతినిధులు నరవ ప్రకాశరావు, బి.చిన్నారావు, ఎ.కాశీవిశ్వేశ్వరరావు, ఆర్.శివకుమార్, బి.గణేశ్వర బాబ్జి పాల్గొన్నారు.

తెల్లవారుజాము వరకు ఆందోళన

▸▸ నేడు కొనసాగిస్తామన్న ఉక్కు ఉద్యోగులు

ఉక్కుటౌన్‌షిప్: విశాఖ స్టీల్‌ప్లాంట్ నాన్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగుల హెచ్ఆర్ఏలో కోత, విద్యుత్ బిల్లులపై అఖిలపక్షం ఆధ్వర్యంలో శనివారం ఈడీ (వర్క్స్) కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళన ఆదివారం తెల్లవారుజామున ఐదు గంటల వరకు కొనసాగింది. ఉక్కు యాజమాన్యం స్పష్టమైన హామీ ఇచ్చే వరకు ఆందోళన కొనసాగిస్తామని ఉద్యోగులు పెద్దఎత్తున నినాదాలు చేశారు. అయితే ఆదివారం పోరాట కమిటీ ఆధ్వర్యంలో మానవహారం చేపట్టనుండడంతో ఉదయం 5 గంటల సమయంలో విరమించారు. సోమవారం ఉదయం మళ్లీ ఈడీ (వర్క్స్) కార్యాలయం వద్ద ఆందోళన చేస్తామని ఉద్యోగులు తెలిపారు. యాజమాన్యం దిగొచ్చే వరకు ఆందోళన కొనసాగుతుందని కార్మిక నాయకులు స్పష్టం చేశారు.


డాబాగార్డెన్స్‌లో లలితా త్రిపుర సుందరిగా ఉమాదేవికి అలంకరణ


సీతమ్మధారలో రేణుకా పరమేశ్వరి అవతారంలో దుర్గాదేవి


సీతమ్మధారలో సూర్యనారాయణునిగా వెంకటేశ్వర స్వామి


సీతంపేటలో లలిత త్రిపుర సుందరిగా పార్వతీదేవి అమ్మవారి అలంకరణ

దేవీమాతకు భక్తిశ్రద్ధలతో పూజలు

డాబాగార్డెన్స్, అక్టోబరు 6: డాబాగార్డెన్స్‌లోని శ్రీ శివరామకృష్ణ దేవాలయంలో ఉమాదేవిని ఆదివారం లలితా త్రిపుర సుందరిగా అలంకరించి భక్తులకు దర్శనావకాశం కల్పించారు. ఆలయ అర్చకుడు భార్గవశర్మ సంప్రదాయ పద్ధతుల్లో ప్రత్యేక పూజలు, కుంకుమార్చన నిర్వహించారు. మహిళలు సామూహికంగా లలితా సహస్రనామ పారాయణం చేశారు. అమ్మవారికి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. అమ్మవారికి దివ్య మంగళ హారతులిచ్చారు. భక్తులందరికీ తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ ఈవో జీవీ రమాబాయి, ఆధ్యాత్మిక వేత్త ఎం.వి.రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

సీతంపేట: సీతంపేట పార్వతీదేవి అమ్మవారు శ్రీ లలితా త్రిపుర సుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు శివాజీ శర్మ, భాస్కర శర్మలు ప్రత్యేక అభిషేకాలు, మహిళలు కుంకుమ పూజ నిర్వహించారు.

సీతమ్మధార: సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్‌లో గల ప్రసన్న వెంకటేశ్వర స్వామి, షిరిడి సాయిబాబా, అయ్యప్ప స్వామి దేవాలయంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలు, దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు కన్నుల పండువగా జరుగుతున్నాయి. వెంకటేశ్వరస్వామి వారిని సూర్యనారాయణ స్వామి అవతారంలో, దుర్గాదేవిని రేణుకా పరమేశ్వరి దేవిగా అలంకరించి భక్తులకు దర్శనావకాశం కల్పించారు. ఆలయం కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ పర్యవేక్షణలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఆలయం చుట్టూ పురవీధుల్లో గరుడ వాహనంపై ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రీ పీహెచ్‌డీ పరీక్షలపై గందరగోళం

5వ పేజీ తరువాయి

తమ సమస్యను వివరించాలని కోరుతున్నారు.

అభ్యర్థుల్లో ఆందోళనకు కారణమిది...

టీడీఆర్ హబ్‌లో చేరిన వందలాది మంది పరిశోధక విద్యార్థులను ఓ అంశం తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత వర్సిటీకి నూతన వీసీ, రిజిస్ట్రార్లను నియమించింది. అదే సమయంలో టీడీఆర్ హబ్ ప్రవేశాల్లో అవినీతి, అక్రమాలు జరిగాయంటూ కొత్త వీసీకి వర్సిటీకి చెందిన పలువురు ఫిర్యాదు చేశారు. వాటిని పరిశీలించిన వీసీ విచారణకు కమిటీని నియమించారు. ఈ కమిటీ ప్రవేశాలకు సంబంధించిన అంశాలను పరిశీలిస్తోంది. ఈ నేపథ్యంలో 2024-25 ఏడాదికి సంబంధించి టీడీఆర్ హబ్‌లో ప్రవేశాలను నిలిపేశారు. దీంతో తమ పీహెచ్‌డీలు ఏమవుతాయోనన్న ఆందోళన పరిశోధక విద్యార్థుల్లో నెలకొంది. అయితే వర్సిటీ అధికారులు మాత్రం ప్రీ పీహెచ్‌డీ పరీక్షలు నిర్వహిస్తామంటున్నారు. ఇప్పటికే ఉన్నతాధికారులకు ఫైల్ పెట్టామని, దరఖాస్తు చేసుకున్న వారికి కొద్దిరోజుల్లోనే పరీక్షలు నిర్వహిస్తామని పేర్కొంటున్నారు. ఎప్పటిలోగా ఈ ప్రక్రియ పూర్తి చేస్తామన్న దానిపై స్పష్టతను ఇవ్వడం లేదు.

మళ్లీ మొదటికి?

5వ పేజీ తరువాయి

చేశారు. అయితే టెండర్లు ఖరారైన తరువాత ఓ వైసీపీ నేత ఒత్తిడితో కాంట్రాక్టరు పనులు చేపట్టేందుకు ముందుకురాలేదు. తరువాత రెండుమూడు సార్లు టెండర్లు పిలిచినా ఎవరూ బిడ్ వేయలేదు. అయితే ఈ ఏడాది జనవరిలో వంతెన నిర్మాణ ప్రతిపాదనలను సవరించి రూ.16 కోట్లకు పెంచి టెండరు ఖరారుచేశారు. అనంతరం మరోసారి శంకుస్థాపన చేశారు. ఈలోగా ఎన్నికలు రావడంతో పనులు ప్రారంభించలేదు. ఇప్పటి వరకు ప్రారంభించని పనులు రద్దుచేయాలని ప్రభుత్వం నిర్ణయించడంతో పొంద్రంగి వంతెన పనులు టెండరు రద్దయింది. కొత్తగా వంతెన నిర్మాణం చేయాలంటే మరోసారి టెండరు విలువ పెంచాలని పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు పేర్కొంటున్నారు. కొత్త రేట్ల ప్రకారం రూ.17 కోట్లు అవసరమవుతుందని అంచనా వేశారు. స్థానికంగా ప్రజలు, ప్రజాప్రతినిధుల నుంచి ఒత్తిడివస్తే ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వం నుంచి ఆమోదం లభించిన తరువాతే టెండర్లు పిలుస్తామని, అందుకు కొంత సమయం పడుతుందని చెబుతున్నారు.

కాగా పద్మనాభం మండలం పొంద్రంగి వద్ద గోస్తని నదిపై ఇప్పటికే కాజ్‌వే ఉంది. దీని పైనుంచే పొంద్రంగి- పద్మనాభం రాకపోకలు సాగుతున్నాయి. వర్షాకాలంలో తగరపువలస వచ్చి జాతీయ రహదారి మీదుగా వంతెన దాటి పద్మనాభం వెళ్లాల్సి ఉంటుంది. అందుకే ఈ వంతెన నిర్మించాలని పొంద్రంగి, పరిసర గ్రామాల ప్రజలు ఏళ్లుగా పోరాడుతున్నారు.

రూ.86.24 లక్షల చోరీసొత్తు రికవరీ

... 5వ పేజీ తరువాయి

చుట్టామన్నారు. సాధారణంగా రికవరీ చేసిన సొత్తును బాధితుడికి అందజేసేందుకు అనుమతించాలంటూ కోర్టులో పిటిషన్ వేస్తామన్నారు. కోర్టు అనుమతించిన తర్వాత బాధితుడు ష్యూరిటీ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. దీనిని అధిగమించేందుకు సొత్తు రికవరీ అయినవెంటనే కోర్టు అనుమతితో బాధితుడికి అందజేసేలా చర్యలు తీసుకున్నామన్నారు. దీనివల్ల బాధితులకు ఆనందంతోపాటు పోలీస్‌స్టేషన్లలో సొత్తుని భద్రపరిచే పరిస్థితి ఉండదన్నారు. సమావేశంలో క్రైమ్ డీసీపీ లతామాధురి, ఏసీపీ వెంకటరావు, సీఐలు జి.శ్రీనివాస్, నిమ్మకాయల శ్రీనివాస్, కోరాడ రామారావు, కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎలుగెత్తిన కార్మిక గళం

... 5వ పేజీ తరువాయి

స్తంభించాయి. రాస్తారోకోలో పాల్గొన్న కార్మిక సంఘ నాయకులను ఏసీపీ టి.త్రినాథ్ ఆధ్వర్యంలో పోలీసులు అరెస్టు చేసి, స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంటు రోజురోజుకు రావణకాష్టంగా మారుతోందన్నారు. సీపీఎం కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంటుకు ఆర్థిక సాయం అందించి, సొంత గనులు కేటాయించాలని ఏళ్లుగా దీక్షలు చేస్తుంటే ఇప్పుడు మీకేం కావాలో చెప్పండంటూ చర్చలకు పిలవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కార్మికులను నిర్బంధించాలని చూస్తున్న ప్రభుత్వాలకు బుద్ధివచ్చేలా చేస్తామన్నారు. ఉక్కును ప్రభుత్వరంగంలో కొనసాగించి, సెయిల్‌లో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ, నిర్వాసిత నాయకులు డి.ఆదినారాయణ, ఎన్.గంగారామ్, పులి వెంకటరమణారెడ్డి, కేఎస్ఎన్ రావు, ఎన్.రామారావు, నీరుకొండ రామచంద్రరావు, జె.అయ్యప్పదొర(?)... జెర్రిపోతుల ముత్యాలు, బొడ్డు పైడిరాజు, విళ్ల రామ్మోహన్ కుమార్, దొమ్మేటి అప్పారావు, పెంటారావు, శ్రీనివాసులు నాయుడు, ప్రగడ వేణుబాబు, పీవీ రమణ, యు.రామస్వామి, వి.ప్రసాద్, వేంకటేశ్వరరావు, గంగవరం గోపి, మాటూరి రాము, గణపతి రెడ్డి, రమణ, గుమ్మడి నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కారును ఢీకొన్న లారీ

ఒకరికి తీవ్ర గాయాలు


ప్రమాదంలో నుజ్జయిన కారు

కూర్మన్నపాలెం, అక్టోబరు 6: నగరంలోని జగదాంబ ప్రాంతానికి చెందిన ఐఎం రావు అనే వ్యక్తి ఆదివారం కుటుంబ సభ్యులు అనురాధ, సుజాతతో కలిసి కొవ్వూరు బయలుదేరారు. ఈ క్రమంలో సాయంత్రం అగనంపూడి సమీపంలోని డొంకాడ వద్దకు వచ్చేసరికి కారును వెనక నుంచి ఓ లారీ బలంగా ఢీకొంది. దీంతో కారు విద్యుత్ స్తంభాన్ని ఢీకొని డివైడర్‌పైకి దూసుకుపోవడంతో నుజ్జునుజ్జయింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న అనురాధ (35) కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అందించిన సమాచారం మేరకు దువ్వాడ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన ఆమెను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అనురాధ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్రీడలతోనే శారీరక ఆరోగ్యం


షటిల్ కోర్టును ప్రారంభిస్తున్న ఉషాకిరణ్, సునీల్ అగర్వాల్

కంచరపాలెం, అక్టోబరు 6: క్రీడలు మానసిక, శారీరక ఆరోగ్యం పెంచుతాయని జనసేన పార్టీ నాయకురాలు పసుపులేటి ఉషాకిరణ్ పేర్కొన్నారు. జీవీఎంసీ 47వ వార్డు రాంజీ ఎస్టేట్ పాఠశాలలో ఆదివారం నూతనంగా ఏర్పాటు చేసిన షటిల్ కోర్టును ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు అల్లుడు సునీల్ అగర్వాల్‌తో కలిసి ఉషాకిరణ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోజూ ఆటలు ఆడటం ద్వారా చక్కని ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవచ్చన్నారు. కార్పొరేటర్ కంటిపాము కామేశ్వరి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు బొడ్డేపల్లి రఘు, గురుబోజి, నరిసింగ్, ఏడుకొండలు, లక్ష్మణ్, బాబు పాల్గొన్నారు.

ఘనంగా జర్నలిస్టుల దసరా సంబరాలు



బాలికల సాంస్కృతిక నృత్యం

డాబాగార్డెన్స్, అక్టోబరు 6: ఏపీ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్, ఏపీ బ్రాడ్ కాస్ట్ జర్నలిస్టుల అసోసియేషన్, ఏపీ స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో దసరా సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విమ్స్ డైరెక్టర్ కె.రాంబాబు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విమ్స్‌లో జర్నలిస్టులకు ఉచిత సేవలు అందిస్తామన్నారు. ఏపీ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఆంజనేయులు, జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, నగర అధ్యక్షుడు పి.నారాయణ్, ఫోటో జర్నలిస్టుల అసోసియేషన్ అధ్యక్షుడు వై.రామకృష్ణ పాల్గొన్నారు. సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. జర్నలిస్టులకు మిఠాయిలు, లక్కీడిప్ ద్వారా ఎంపికైన వారికి బహుమతులు అందజేశారు.


శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా సీతమ్మధార ఆక్సిజన్ టవర్స్‌లోని అపార్ట్‌మెంట్‌లో దాండియా నృత్యం చేస్తున్న యువతులు

బీజేపీ సభ్యత్వ నమోదు

అక్కయ్యపాలెం, అక్టోబరు 6: గ్రేటర్ 44వ వార్డు బీజేపీ అధ్యక్షుడు రఘునాథ్ ఆధ్వర్యంలో 123, 125 పోలింగ్ బూత్‌ల పరిధిలో ఆదివారం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల అధ్యక్షురాలు మళ్ల లక్ష్మి, సీతారాములు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు సీఐ కౌన్సెలింగ్

సీతంపేట, అక్టోబరు 6: ప్రతి ఒక్కరూ సత్ప్రవర్తనతో నడవాలని, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని నాలుగో పట్టణ సీఐ విజయ్‌కుమార్ హెచ్చరించారు. ఆదివారం నాలుగో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎస్ఐ వెంకటరావ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

పూర్ణామార్కెట్, అక్టోబరు 6: వన్‌టౌన్ పాతపోస్టాఫీసు వద్ద ఇతిహాద్ ముస్లిం కమ్యూనిటీ, హాస్నేన్ ట్రస్ట్ సంయుక్తంగా మోహదీ భవనం వద్ద ఆదివారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. దీన్ని ప్రముఖ వ్యాపారవేత్త అమీద్ అలీఖాన్ ప్రారంభించారు. అపోలో వైద్యుల సౌజన్యంతో ముస్లిం కుటుంబాలకు వైద్యసేవలు అందజేశారు 111 మందికి వైద్యులు సేవలందించారు. ఇత్తిహాద్ ముస్లిం కమ్యూనిటీ అధ్యక్షుడు ఐహెచ్ ఫరూక్, వైద్యులు పాల్గొన్నారు. రోగులకు ట్రస్ట్ ద్వారా ఉచితంగా మందులు అందజేశారు.

'కార్మికవర్గాన్ని ఐక్యం చేయాలి'


డాబాగార్డెన్స్, అక్టోబరు 6: సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా కార్మికవర్గాన్ని ఐక్యం చేయాలని జేఎన్‌యూ ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ ప్రభాత్ పట్నాయక్ పిలుపునిచ్చారు. డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఆదివారం లెనిన్ శత వర్ధంతి సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా హాజరై ఆయన ముందుగా లెనిన్, సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్మికవర్గం ఎలా ఉండాలో కమ్యూనిస్టు పార్టీ నిర్మాణం చేసి చూపిన మహోన్నత వ్యక్తి లెనిన్ అని కొనియాడారు. ప్రభుత్వ రంగ సంస్థలు ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్లి నిరుద్యోగం మరింత పెరుగుతుందన్నారు. ఇతర దేశాల నుంచి సరుకులు దిగుమతి చేసుకోవడంతో మన దేశ పంటకు రేటు తగ్గిపోతుందన్నారు. ఉద్యమాలు జరిగేచోట వామపక్ష భావజాలంతో ఉన్నవారు అధికారంలోకి వస్తున్నారని గుర్తుచేశారు. కార్యక్రమానికి సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు అధ్యక్షత వహించగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ, కె.లోకనాథం, కృష్ణమూర్తి, గంగారావు తదితరులు పాల్గొన్నారు.



లెనిన్, సీతారాం ఏచూరి చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న ప్రొఫెసర్ ప్రభాత్ పట్నాయక్, జగ్గునాయుడు, శ్రీనివాసరావు తదితరులు


నాగమయ్యపాలెం ఉప్పుటేరులో పడవల నిలిపివేత



భీమునిపట్నం (రూరల్), అక్టోబరు 6: నాగమయ్యపాలెంలో ఉప్పుటేరును పడవల నిలిపివేతకు అనుకూలంగా తీర్చిదిద్దుతున్నారు. ఈ గ్రామంలో అంతా మత్స్యకారులే. అత్యధికులు ప్రతిరోజూ పడవలపై వేటకు వెళుతుంటారు. వారి పడవలు మాత్రం భీమిలి ఉప్పుటేరు ప్రాంతంలో ఉంచుతారు. ఇక్కడ గోస్తనీ నది సంగమం ఉండడంతో దీని నుంచి పడవలు నేరుగా సముద్రంలోకి వెళ్లడానికి అవకాశం ఉంటుంది. ప్రతిరోజూ తెల్లవారుజామున నాగమయ్యపాలెం నుంచి భీమిలి వచ్చి పడవలను సముద్రంలోకి తీసుకువెళ్లి మళ్లీ అదేవిధంగా వచ్చి పడవలను నిలుపుదల చేసి, ఇళ్లకు చేరుకుంటారు. ఇది వారికి ఇబ్బందికరంగా మారడంతో నాగమయ్యపాలెం గోస్తనీ నది వద్ద ఉప్పుటేరుగా ఉన్న ప్రాంతంలో పడవల నిలిపివేతకు తగిన సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇక్కడి నుంచి నేరుగా సముద్రంలోకి వెళ్లడానికి అవకాశం ఉంది. అయితే లోతు తక్కువగా ఉండడం వల్ల కొన్నిసార్లు పడవల నిలిపివేతకు కష్టం అవుతోందని మత్స్యకారులు చెబుతున్నారు. పాలకులు, అధికారులు స్పందించి ఈ ప్రాంతంలో పూడిక తీసి లోతు చేస్తే పడవలను శాశ్వతంగా నిలిపి ఉంచడానికి అవకాశం ఉంటుందని కోరుతున్నారు.







ANDHRA JYOTHI CLASSIFIEDS

WANTED

★ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను / పేషంట్స్ / చంటి పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం కలదు. జీతం 18k. Ph: 9640258899, 9640468899 AJH-15274

For Advertisement Contact :
9963231176
9966165093

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి



మానవహారంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, గురుమూర్తిరెడ్డి, తదితరులు

'ఉక్కు'ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలి

మానవహారంలో అఖిలపక్ష కార్మిక సంఘ నాయకులు

గాజువాక, అక్టోబరు 6: విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రభుత్వ రంగంలోనే ఉంచుతామని కేంద్ర ప్రభుత్వం ప్రకటన చేయాలని ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘ నాయకులు డిమాండ్ చేశారు. ప్లాంట్ పరిరక్షణతో పాటు ఉద్యోగుల సంక్షేమానికి చర్యలు చేపట్టాలని, నిర్వాసితులకు ఉపాధి, కాంట్రాక్టు కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం పాత గాజువాకలో మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ కేంద్రం దుర్మార్గంగా వ్యవహరిస్తుందని, కూటమి ప్రభుత్వం కేంద్రంతో మాట్లాడి స్టీల్‌ప్లాంటును ప్రభుత్వ రంగంలోనే కొనసాగిస్తామని ప్రకటన చేయించాలన్నారు. ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికుల విషయంలో ఉక్కు యాజమాన్యం దుర్మార్గంగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. నిర్వాసితులకు ఉపాధి లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మానవహారంలో మాజీ ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, తిప్పల గురుమూర్తిరెడ్డిలు పాల్గొని మద్దతు తెలిపారు. కార్యక్రమంలో కార్మిక నాయకులు జెర్రిపోతుల ముత్యాలు, గొందేశి ప్రభాకర్‌రెడ్డి, పిట్టా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వినూత్నంగా ఉక్కు ఉద్యోగి నిరసన

కూర్మన్నపాలెం: తరాలు మారినా తలరాతలు మారలేదని.. కడుపు కోతే మిగిలిందని, విశాఖ ఉక్కును కాపాడమ్మా దుర్గమ్మ తల్లీ.. అంటూ స్టీల్‌ప్లాంట్ ఉద్యోగి బిసాయ్ వినూత్నంగా భవానీమాల ధరించిన భక్తుని వేషధారణతో నిరసన తెలిపారు. కూర్మన్నపాలెంలో చేపట్టిన మానవహారంలో ఆయన ఈ వేషధారణతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ సందర్భంగా బిసాయ్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లతోనే ఉక్కు పరిరక్షణ సాధ్యమవుతుందన్నారు.



ఉక్కు ఉద్యోగి బిసాయ్

అగనంపూడిలో కార్మిక సంఘాల నాయకులు..

అగనంపూడి: స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు స్థానికంగా కార్మిక సంఘాల నాయకులు, నిర్వాసితులు మానవహారంగా ఏర్పడి నిరసన తెలుపుతూ రాస్తారోకో చేపట్టారు. ఉక్కు కర్మాగారంపై కేంద్రం అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. స్టీల్‌ప్లాంటును సెయిల్‌లో విలీనం చేయాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్, కార్మిక సంఘాల నాయకులు బి.సత్యనారాయణ, గంతకోరు అప్పారావు, కె.పైడిరాజు, ఎస్.గోవిందరావు, యు.మరిడయ్య, ఎం.నరసింగరావు, బాబ్జీ, సాంబశివరావు, సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు నిర్వాసిత కాలనీల్లో పాదయాత్ర



పాదయాత్రలో పాల్గొన్న ఉక్కు నిర్వాసిత నాయకులు

పెదగంట్యాడ: విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రభుత్వ రంగ సంస్థగానే కొనసాగించాలని, అందుకు అవసరమైన గనులు కేటాయించి పూర్తి సామర్థ్యంతో నడపాలని నిర్వాసిత నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం పెదగంట్యాడ నిర్వాసిత కాలనీల్లో పాదయాత్ర చేపట్టారు. నడుపూరు గాంధీ పార్కు వద్ద ప్రారంభమైన పాదయాత్ర సీతానగరం ఎన్టీఆర్ జంక్షన్, సీకువానిపాలెం మీదగా కమ్యూనిటీ వెల్ఫేర్ సెంటర్ వరకు సాగింది. ఈ సందర్భంగా టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పులి వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను ఉద్యమాల ద్వారానే అడ్డుకుంటామన్నారు. ప్లాంటులో పని చేస్తున్న సంఘటిత, అసంఘటిత కార్మికులకు అన్ని అలవెన్స్‌లతో వేతనాలు చెల్లించాలని నిర్వాసిత నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కణితి అప్పలరాజు, మొల్లి రమణబాబు, ఎంఎస్ రాజు, నక్క సన్యాసిరావు, ఉరుకూటి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

పబ్లిక్ హెల్త్ కాన్ఫరెన్స్‌లో ఏయూ రిజిస్ట్రార్

విశాఖపట్నం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్యంపై బ్యాంకాంగ్‌లో జరుగుతున్న గ్లోబల్ హెల్త్ కాన్ఫరెన్స్‌లో ఏయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఈఎన్ ధనుంజయరావు వర్చువల్‌గా శనివారం పాల్గొన్నారు. ఈ సదస్సులో భాగస్వామ్యమైన శ్రీలంకకు చెందిన ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ నాలెడ్జ్ మేనేజ్‌మెంట్ (టీఐఐకేఎం) ప్రతినిధులతో ధనుంజయరావు పలు అంశాలపై చర్చించారు. ఈ సదస్సులో వివిధ దేశాలకు చెందిన పలువురు పాల్గొని పబ్లిక్ హెల్త్ ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. ప్రజారోగ్యానికి అంతర్జాతీయ సంస్థలతో కలిసి నడుస్తామని ఈసందర్భంగా రిజిస్ట్రార్ పేర్కొన్నారు.

'మద్యం పాలసీలో గీత కార్మికులకు రాయితీ ఇవ్వాలి'

పెదగంట్యాడ, అక్టోబరు 6: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మద్యం పాలసీలో గీత, సహ కులాల కార్మికులకు రాయితీ ఇవ్వాలని పారిశ్రామిక ప్రాంత గీత సహకులాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు చెల్లుబోయిన నాయుడు డిమాండ్ చేశారు. సమతానగర్‌లోని సంఘం కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సంఘం సభ్యులతో సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. గీత, సహకులాల వారికి పదిశాతం షాపులు కేటాయించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని, దీనిని 20శాతానికి పెంచాలని కోరారు. పారిశ్రామిక ప్రాంతంలో గీత, సహకులాల కార్మికులు ఎక్కువగా ఉన్నారని, ఇక్కడ తాటి, ఈత చెట్లు తొలగింపుతో గీత కార్మిక వృత్తి అంతరించి పోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. అందువల్ల గీత కార్మికులకు ఆదుకునేలా ప్రభుత్వం నిర్ణయంతీసుకోవాలని కోరారు. సంఘం ఉపాధ్యక్షుడే పీత సన్యాసిరావు, గౌరవాధ్యక్షుడు నెల్లి సాధూరావు, కార్యవర్గం సభ్యులు అండిబోయిన సన్యాసిరావు, పూడి రమణ, సంపంగి అప్పలమూర్తి, అండిబోయిన రామునాయుడు, భాస్కరరావు, పాత్రుడు పాల్గొన్నారు.



చెల్లుబోయిన నాయుడు

నాయకత్వ లక్షణాలకు ఎన్‌సీసీ శిక్షణ దోహదం

లెఫ్టినెంట్ కల్నల్ నీరజ్ కుమార్



కార్యక్రమంలో మాట్లాడుతున్న కల్నల్ నీరజ్‌కుమార్

విశాఖపట్నం, అక్టోబరు 6 : ఎన్‌సీసీ క్యాడెట్లలో క్రమశిక్షణ, ఏకాగ్రత, నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు శిక్షణ దోహదపడుతుందని లెఫ్టినెంట్ కల్నల్ నీరజ్ కుమార్ అన్నారు. రుషికొండ గాయత్రి క్యాంపస్ వేదికగా కళాశాల ఎన్‌సీసీ కెప్టెన్ అనంత భాస్కర్ ఆధ్వర్యంలో ఉత్తరాంధ్రకు చెందిన త్రివిధ దళాల ఎన్‌సీసీ క్యాడెట్ల వార్షిక శిక్షణ శిబిరాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శిక్షణలో క్యాడెట్లకు శారీరక దారుఢ్యం, ఆత్మ విశ్వాసంతో నిర్ణయాలు తీసుకునేలా డ్రిల్స్, ఫైరింగ్, క్విజ్ పోటీలు, సాంస్కృతి తదితర కార్యక్రమాలు అందించనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు ఎన్‌సీసీ ఆఫీసర్లు, ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.

శిథిలావస్థలో మండల రీసోర్స్ సెంటర్

కూలడానికి సిద్ధంగా ఉండడంతో నెల్లిముక్కు యూపీ పాఠశాలలోకి మార్చిన అధికారులు

నూతన భవనం నిర్మించాలని ఉన్నతాధికారులకు నివేదించామన్న ఎంఈవో



పిచ్చిమొక్కల మధ్యనున్న రీసోర్స్ సెంటర్

పెదగంట్యాడ, అక్టోబరు 6: పెదగంట్యాడ మండల రీసోర్స్ సెంటర్ పూర్తిగా శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారింది. రెండు దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ భవనానికి సకాలంలో మరమ్మతులు చేపట్టకపోవడం వల్లే ఈ దుస్థితి నెలకొంది. భవనం చుట్టూ ముళ్లపొదలు, పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగిపోవడంతో పాములు, ఇతర విషకీటకాలు సంచరిస్తున్నాయి. ఈ సెంటర్‌లోకి వెళ్లేందుకు దారి కూడా కనిపించడం లేదంటే పరిస్థితి ఎలాగుందో అర్థం చేసుకోవచ్చు. రెండు సంవత్సరాల క్రితం వరకు ఈ భవనంలోనే మండల విద్యాశాఖ కార్యకలాపాలన్నీ సాగేవి. ఇన్‌చార్జి మండల విద్యాశాఖాధికారి ఆధ్వర్యంలో ఈ సెంటర్ నడిచేది. శిథిల స్థితికి చేరిన ఈ భవనం ఎప్పుడు కూలుపోతుందో తెలియని స్థితికి చేరడంతో కార్యాలయాన్ని మార్చేందుకు అధికారులు నిర్ణయించారు. అదే సమయంలో పాఠశాలల విలీనం జరగడంతో నెల్లిముక్కు అప్పర్ ప్రైమరీ పాఠశాలలోని మూడు బ్లాకుల్లో ఒకటి ఖాళీ కావడంతో మండల రీసోర్స్ సెంటర్‌ను అందులోకి మార్చారు. ఈ బ్లాక్‌లోని ఒక గదిలో ఇద్దరు ఎంఈవోలు, సిబ్బంది, మరో గదిలో మండల విద్యాశాఖకు సంబంధించిన సామగ్రిని ఉంచారు. ప్రస్తుతం ఇక్కడ నుంచే మండల విద్యాశాఖ కార్యకలాపాలన్నీ కొనసాగుతున్నాయి

ఎంఆర్‌సీని పునర్నిర్మించాలని నివేదించాం

-ఎంఈవో ఈ.శ్రీనివాస్



న్యూపోర్టు పోలీస్ స్టేషన్ సమీపంలో విశాలమైన స్థలంలో ఉన్న మండల రిసోర్స్ సెంటర్ పూర్తిగా శిథిలావస్థకు చేరినందున దానిని తొలగించి, నూతన భవనాన్ని నిర్మించాలని గతంలోనే జిల్లా విద్యాశాఖ అధికారులకు నివేదించాం. వారు కూడా ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకున్నారు. నూతన భవన నిర్మాణానికి ప్రయత్నాలు సాగిస్తున్నారు.

జగజ్జననీ.. పాహిమాం

వివిధ రూపాల్లో దర్శనమిచ్చిన దుర్గమ్మ



నాయుడుతోట గుడివీధిలో మహాలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చిన గాయత్రిదేవి



88వ వార్డు ఎస్టీబీఎల్‌లో పోలమాంబ అమ్మవారిని శాకంబరిగా అలంకరించిన దృశ్యం

వేపగుంట, అక్టోబరు 6: శరన్నవ రాత్రి ఉత్సవాలు పలు ప్రాంతాల్లో వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా నాయుడుతోట కృష్ణానగర్ గుడివీధిలోని దుర్గాదేవి ఆలయంలోని అమ్మవారు మహాలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే గాయత్రీదేవి ఆలయంలోని అమ్మవారిని కరెన్సీ నోట్లు, పుష్పాలతో మహాలక్ష్మీదేవిగా అలంకరించగా, అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. రవినగర్ శేషాద్రి కొండపై ఉన్న కల్యాణ వేంకటేశ్వరాలయంలో సామూహిక విష్ణు సహస్రనామ పారాయణాన్ని పఠించగా, వేపగుంట ముత్యాలమ్మ ఆలయంలో, అప్పన్నపాలెంలోని వర్షిణి టవర్స్ జీ-బ్లాక్‌లో కుంకుమ పూజలు చేశారు. బుచ్చిరాజుపాలెం దుర్గాలమ్మ, బంగారమ్మ ఆలయంలో జరిగిన సామూహిక కుంకుమ పూజల్లో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. ఎస్.ఎ.డి.లో మార్వాడి మంచ్ ఆధ్వర్యంలో జరిగిన శరన్నవరాత్రి వేడుకల్లో డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ దంపతులు పాల్గొని పూజలు చేశారు. మర్రిపాలెం వుడా కాలనీలో కాలనీ అసోసియేషన్ ఆధ్వ ర్యంలో జరిగిన వేడుకల్లో మహిళల దాండియా నృత్యం ఆకట్టుకుంది.

అగనంపూడి: ఇక్కడి పోస్టాఫీసు వద్ద గల దుర్గమాంబ ఆలయంలో అమ్మవారు లలితాత్రిపురసుందరీదేవిగా దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారిని పసుపుకొమ్ములతో అలంకరించగా, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. పెదమడక కొండపై ఉన్న దుర్గాదేవి ఆలయంలోని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయడంతో పాటు మధ్యాహ్నం అన్నసమారాధను చేపట్టారు.

ఉక్కుటౌన్‌షిప్: స్టీల్‌ప్లాంట్ త్రిశక్తి ఆలయంలో శ్రీమహాదుర్గను అన్నపూర్ణాదేవిగా, శ్రీమహాలక్ష్మిని సంతానలక్ష్మిగా, శ్రీమహాసరస్వతిని హంసవాహిని రూపంలో అలంకరించారు. పసుపుకొమ్ములతో అర్చన, కుంకుమార్చనలను అర్చకులు పణిశర్మ నిర్వహించారు.

కూర్మన్నపాలెం: గ్రేటర్ 86వ వార్డు రాజీవ్ నగర్‌లో నవదుర్గ అమ్మవారి కల్యాణ మండపంలో అమ్మవారికి 58 రకాల పిండివంటలను నైవేద్యంగా సమర్పించారు. ప్రత్యేక పూజల్లో టీడీపీ వార్డు అధ్యక్షుడు నల్లూరు సూర్యనారాయణతో పాటు నాయకులు మాడిశ కనకరాజు, వేగుంట శ్రీనివాస్, వెంకటసుబ్బయ్య, నాగార్జున, తదితరులు పాల్గొన్నారు. 88వ వార్డు ఎస్టీబీఎల్‌లో పోలమాంబ అమ్మవారిని, 70వ వార్డు ఎల్‌వీ నగర్ కనకదుర్గమ్మ ఆలయంలోని అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించి పంచామృతాభిషేకాలు, పూజలు చేశారు. అలాగే డ్రైవర్స్ కాలనీలోని కనకదుర్గమ్మ ఆలయంలోని అమ్మవారిని రాజేశ్వరీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు, సామూహిక కుంకుమ పూజలు జరిపారు.

మల్కాపురం: యారాడ కొండపై వెలసిన సాగరగిరి కనకదుర్గమ్మ భక్తులకు భువనేశ్వరీదేవిగా దర్శనమిచ్చారు. ఆదివారం సెలవు రోజు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి బోట్ల ద్వారా అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి విచ్చేశారు. రోడ్డు మార్గం నుంచి వచ్చిన భక్తులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా ఆలయ కమిటీ తగిన ఏర్పాట్లు చేసింది. ఆలయ ప్రాంగణంలో మధ్యాహ్నం అన్న సమారాధన చేపట్టారు. కాగా గాజువాక ఆర్టీసీ డిపో వద్దనున్న విజయదుర్గమ్మ ఆలయంలో అమ్మవారిని లక్ష గాజులతో అలంకరించి పూజలు చేశారు. అనంతరం అమ్మవారు లలితాత్రిపురసుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. 108 అఖండ జ్యోతి కాగాడాలతో అమ్మవారి సారె ఊరేగింపు చేపట్టారు. కాగా 58వ వార్డు పరిధి ఎదురువానిపాలెంలో దుర్గాదేవికి సారె సమర్పణ కార్యక్రమంలో పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు పాల్గొన్నారు. తలపై సారె సామగ్రితో ఆయన వచ్చి మండపం వద్ద కొలువుదీరిన అమ్మవారికి సమర్పించారు. కార్యక్రమంలో టీడీపీ వార్డు అధ్యక్షుడు కోరాడ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



చినముషిడివాడలోని శారదా పీఠంలో అన్నపూర్ణ అలంకారంలో రాజశ్యామల అమ్మవారు



అగనంపూడి పోస్టాఫీసు వద్ద పసుపుకొమ్ములతో అలంకృతురాలైన దుర్గాదేవి



58వ వార్డు ఎదురువానిపాలెంలో దుర్గాదేవి సమర్పించేందుకు సారెతో వెళుతున్న ఎమ్మెల్యే గణబాబు



శీలానగర్ అనురాధ పెట్రో సర్వీస్ సెంటర్ వద్ద దుర్గాదేవి సన్నిధిలో ఎమ్మెల్యే గౌతు శిరీష దంపతులు



86వ వార్డు పరిధి రాజీవ్ నగర్‌లో దుర్గాదేవికి నివేదించిన 58 రకాల వంటకాలు

గోపాలపట్నం: కొత్తపాలెంలోని విజయదుర్గాదేవి ఆలయంలో అమ్మవారిని లలితాత్రిపురసుందరిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సామూహిక కుంకుమ పూజల్లో వందలాది మంది మహిళలు పాల్గొన్నారు.

పెందుర్తి: ఇక్కడి ప్రశాంతిగనర్‌లోని దుర్గాదేవి ఆలయంలో అమ్మవారిని, వెంకటాద్రి శిఖరం దిగువన గల మహాకామేశ్వరీ ద్వాదశ సహిత జ్యోతిర్లింగాలయంలో మాతను అన్నపూర్ణ రూపిణిగా అలంకరించి పూజలు చేశారు. మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి మహాకామేశ్వరి మాతను దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆయన వెంట టీడీపీ నాయకులు కరక దేవుడు, అవగడ్డ అప్పలనాయుడు, దాట్ల మధు, శ్రీను యాదవ్ ఉన్నారు. మండలంలోని ఎస్‌ఆర్‌పురంలోని కనకదుర్గ ఆలయంలోని అమ్మవారిని, చినముషిడివాడ శ్రమశక్తినగర్‌లోని పంచముఖ గాయత్రీదేవినీ అన్నపూర్ణగా, సప్తగిరినగర్‌లో అలివేలు మంగాదేవి ఆలయంలో అమ్మవారిని గజలక్ష్మిగా పూజలు చేశారు. శారదాపీఠంలో అధిష్ఠాన దేవత శారదా స్వరూపా రాజశ్యామల అమ్మవారు అన్నపూర్ణ భక్తులకు దర్శనమిచ్చారు. యాగశాలలో చండీహోమం నిర్వహిస్తున్నారు. సాయంత్రం సామూహిక కుంకుమార్చన, సువాసిని పూజలు జరిపారు.

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ అనురాధ పెట్రో సర్వీస్ సెంటర్‌లో నిర్వహిస్తున్న దేవీ నవరాత్రి ఉత్సవాల్లో పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష పాల్గొన్నారు. అన్నపూర్ణాదేవి అలంకరణలో ఉన్న అమ్మవారికి గౌతు శిరీష, వెంకన్నచౌదరి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సర్దార్ నెస్ట్, పెట్రో సర్వీస్ సెంటర్ సిబ్బంది, పలువురు భక్తులు పాల్గొన్నారు.

పెదగంట్యాడ: జీవీఎంసీ 65వ వార్డు పరిధి వాంబేకాలనీలోని అమ్మవారు గజలక్ష్మి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారి సన్నిధిలో సుదర్శన హోమాన్ని వేంకటేశ్వరాలయ కమిటీ ఛైర్మన్ దొడ్డి రమణ, ధర్మకర్త మంత్రి మంజుల ఆధ్వర్యంలో జరిపారు. కమిటీ సభ్యులు అప్పలరెడ్డి, పి.రాజు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.





సభ్యులనుద్దేశించి మాట్లాడుతున్న డైరెక్టర్ సాహు

ఇళ్ల నిర్మాణం కోసం పాలక వర్గానికి అనుమతి

భెల్ హెచ్‌పీవీపీ హౌస్ బిల్డింగ్ సొసైటీ సర్వసభ్య సమావేశంలో తీర్మానం

అక్కిరెడ్డిపాలెం, అక్టోబరు 6: సాలాపువానిపాలెంలో వున్న 3వ ఫేజ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ స్థలంలో ఇళ్ల నిర్మాణం చేపట్టేందుకు ప్రస్తుత పాలక వర్గానికి పూర్తి అధికారాన్ని ఇస్తున్నట్లు భెల్ హెచ్‌పీవీపీ హౌస్ బిల్డింగ్ సొసైటీ సర్వసభ్య సమావేశం తీర్మానించింది. భెల్ టౌన్‌షిప్‌లోని కళాభారతిలో ఆదివారం జరిగిన సొసైటీ 48వ సర్వసభ్య సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. సొసైటీ ఉపాధ్యక్షుడు ఎ.వెంకటరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పలువురు డైరెక్టర్‌లు మాట్లాడుతూ గత పాలక వర్గాల అలసత్వం వల్ల 24 ఏళ్లుగా సభ్యుల సొంతింటి కల కలగానే మిగిలిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్‌రావు, రాష్ట్ర మంత్రి నారాయణరావు చూపిన చొరవతో వీఎంఆర్‌డీఏ నుంచి 352 ఇళ్ల నిర్మాణానికి అనుమతి లభించిందని స్పష్టం చేశారు, ఇళకల నిర్మాణాల కోసం ఇప్పటికే టెండర్లు పిలవడం జరిగిందని, సభ్యులు అందరి సహకారంతో త్వరలోనే ఇంటి నిర్మాణాలను ప్రారంభించి సభ్యుల సొంతింటి కలను సాకారం చేస్తామని హామీ ఇచ్చారు. ఇందుకు మెజారిటీ సభ్యులు అంగీకారాన్ని తెలపడం పట్ల పాలకవర్గం ఆనందం వ్యక్తం చేసింది. ఈ సమావేశంలో డైరెక్టర్‌లు ఎస్.సాహు, పి.భాస్కరరావు, పీవీఎస్ రాజు, వీఎస్ఆర్ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.



విరాళాలు సేకరిస్తున్న మహిళా సంఘ సభ్యులు

వరద బాధితుల కోసం విరాళాల సేకరణ

గోపాలపట్నం, అక్టోబరు 6: విజయవాడ వరద బాధితుల సహాయార్థం స్థానిక జనతా కాలనీ మహిళా సంఘ సభ్యులు విరాళాలను ఆదివారం సేకరించారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షురాలు ఎం.విమల మాట్లాడుతూ కాలనీలో విరాళంగా సేకరించిన మొత్తాన్ని జిల్లా కలెక్టర్‌కు అందజేస్తామన్నారు.

పైపు లైన్‌కు మరమ్మతులు చేశారు..

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



పైపులైన్‌కు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

పెదగంట్యాడ, అక్టోబరు 6: గ్రేటర్ 65వ వార్డు పరిధి యాతపాలెంలో యూజీడీ వాటర్ పైపు లైన్ లేకేజీలకు ఆదివారం జీవీఎంసీ సిబ్బంది మరమ్మతులు చేశారు. 'వృథాగా పోతున్న తాగునీరు' శీర్షికతో ఆదివారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి జీవీఎంసీ గాజువాక జోన్ అధికారులు స్పందించారు. ఈ మేరకు ఉదయం నుంచి సాయంత్రం వరకు సిబ్బంది పైపులైన్ లీకేజీలకు మరమ్మతులు చేశారు. యాతపాలేనికి ఇక నుంచి పూర్తి సామర్థ్యంతో తాగునీటి సరఫరా అవుతుందని సిబ్బంది తెలిపారు. సమస్య పరిష్కారానికి జీవీఎంసీ అధికారులు తక్షణ చర్యలు చేపట్టడం పట్ల కాలనీవాసులు సంతృప్తి వ్యక్తం చేశారు.

మాదిగలకు త్వరలో వర్గీకరణ ఫలాలు

మల్కాపురం, అక్టోబరు 6: మాదిగలకు త్వరలోనే ఎంఆర్‌పీఎస్ పోరాట ఫలాలు అందనున్నాయని మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎంఆర్‌పీఎస్ సీనియర్ నాయకుడు పెద్దాడ వెంకటరమణ పేర్కొన్నారు. ఆదివారం ప్రకాశనగర్ ఏడుగుళ్ల జంక్షన్ వద్ద ఉన్న అరుంధతి సంక్షేమ సంఘంలో ఎంఆర్‌పీఎస్ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 11వ తేదీన ఎంఆర్‌పీఎస్ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ విశాఖ నగరానికి రానున్న సందర్భంగా ఆయనకు ఘనంగా స్వాగతం పలకాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు అనపర్తి సైదా సుదర్శన్, ఏడాది నూకరాజు, స్వామి , ఎంఆర్‌పీఎస్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

పినగాడిలో అన్న సమారాధన

పెందుర్తి, అక్టోబరు 6: మండలంలోని పినగాడిలో బయలపూడి మహేశ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన అన్నసమారాధన కార్యక్రమాన్ని మండల టీడీపీ అధ్యక్షుడు కరక దేవుడు ప్రారంభించారు. కార్యక్రమంలో బయలపూడి హరగోపాల్, గొరపల్లి జయకృష్ణ పాల్గొన్నారు. జుత్తాడ, ఎస్‌ఆర్‌పురంలో నిర్వహించిన అన్నసమారాధనలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రెడ్డి నారాయణరావు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **శ్వాగ్ :** శ్రీవెంకటేశ్వర, శ్రీరామ, శ్రీకన్య శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్-2 (పెందుర్తి), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **దక్షిణ :** కిన్నెర, శారద, గోకుల్, శ్రీనరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య హెవెన్ (గాజువాక), తాతా (తగరపువలస)
- **రామ్‌నగర్ బన్నీ :** రమాదేవి, విశేష్ (గాజువాక)
- **దేవర :** మెలోడి, జగదాంబ, శరత్, కామేశ్వరి, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), కన్య కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1 (పెందుర్తి), రాములమ్మ (తగరపువలస)
- **సత్యం సుందరం :** సంగం, వెంకటేశ్వర, కిన్నెర, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), గణేష్ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 49, టమాటా 72, వంకాయలు (తెలుపు) 30, వంకాయలు (నలుపు) 54, బెండకాయలు 34, పచ్చిమిర్చి 40, కాకరకాయలు 46, బీరకాయలు 55, ఆనపకాయ 24, కాలీఫ్లవర్ 44, క్యాబేజీ 20, క్యారెట్ 48 దొండకాయలు 60, బంగాళదుంపలు 30, అరటికాయ (పెద్దది) 8, అల్లం (పాతది) 85, మునక్కాడలు (కిలో) 95, బరబాటి 46, ముల్లంగి 32, నిమ్మకాయలు (కిలో) 84, గోరుచిక్కుడు 38, దోసకాయలు 36, వెల్లుల్లి (పెద్దవి) 280, కొబ్బరికాయ (పెద్దది) 26, బీన్స్ (పెన్సిల్) 98, పొటల్స్ 36, కీరదోస 32, క్యాప్సికమ్ 66, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 46, చిలగడదుంపలు 44, కంద 62, దేముడు చిక్కుడు 64, కొండఉసిరి 85, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాలకూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 5, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 30, మామిడి అల్లం 90, బొప్పాయి 35, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	525
విజయనగరం	529
శ్రీకాకుళం	529

చికెన్ ధరలు

బ్యాగ్		
రైతు ధర	--	110
ఫారం ధర	--	130
విత్ స్కిన్	--	230
స్కిన్‌లెస్	--	240

మరికొన్ని సిటీ వార్తలు పేజీ 10లో..

బిడ్డకు జన్మనిచ్చిన మానసిక రోగి

అక్కయ్యపాలెం, అక్టోబరు 6: ఓ మానసిక రోగి (35) ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. రైల్వేస్టేషన్‌లో ఏయూటీడీ సంస్థ ప్రతినిధులు గతంలో ఒడిశాకు చెందిన మహిళా మానసిక రోగిని గుర్తించారు. ఆమెను ఆసుపత్రిలో చేర్చి తనిఖీ చేయించగా గర్భవతిగా తేలింది. ఈ ఏడాది జూన్ 8న టీఎస్సార్ కాంప్లెక్స్‌లోని నిరాశ్రయుల వసతిగృహంలో ఆమెకు ఆశ్రయం కల్పించినట్లు ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు. నెలలు నిండడంతో ఆగస్టు 20న కేజీహెచ్‌లో చేర్పించారు. గత నెల 19న వైద్యులు శస్త్రచికిత్స చేయగా పాపకు జన్మనిచ్చిందన్నారు. కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్, హెచ్‌ఓడీ డాక్టర్ ఉషారాణి, వైద్యుల సమక్షంలో ఏయూటీడీ సిబ్బందికి పాపను అప్పగించారు.

'మహిళల జీవనం మెరుగుపరుస్తాం'

మహారాణిపేట, అక్టోబరు 6: మహిళల జీవన నాణ్యతను మెరుగుపరచటమే హ్యూమనిటేరియన్ అసిస్టెన్స్ ట్రస్టు లక్ష్యమని డాక్టర్ ఎస్.శశిప్రభ అన్నారు. బ్రిడ్జ్‌స్టోన్ ఇండియా మొబిలిటీ సోషల్ ఇంపాక్ట్ అవార్డును-2024 గెలుచుకున్న సందర్భంగా మహారాణిపేటలో నిర్వహించిన సమావేశంలో డా.శశిప్రభ మాట్లాడుతూ మహిళలకు సాధికారత కల్పించటమే లక్ష్యంగా ట్రస్టు ద్వారా శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా మహిళలకు ఆర్థిక స్వావలంబన, లింగ సమానత్వం, స్వతంత్రత వస్తుందన్నారు.


శిథిలావస్థలో ఎంవీడీఎం పాఠశాల భవనం


తరగతిగది లోపలి భాగం దుస్థితి


అధ్వాన స్థితిలో మరుగుదొడ్లు

బడికెళితే సమస్యల పాఠాలేనా?

జగదాంబ కూడలి, అక్టోబరు 2: వన్‌టౌన్‌లో జీవీఎంసీ ఆధీనంలోని ఎంవీడీఎం ఉన్నత పాఠశాల విద్యార్థులు సమస్యల పాఠాలు వల్లెవేస్తున్నారు. ఐదేళ్లుగా ఈ బడి నిర్లక్ష్యపు నీడలో కొట్టుమిట్టాడుతోంది. వైసీపీ పాలకులు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదు. పాత లక్ష్మీటాకీస్ ప్రాంత పరిధిలోని పేద, మధ్య తరగతి విద్యార్థులు ఇందులో విద్యనభ్యసిస్తున్నారు. ప్రస్తుతం 6 నుంచి పదో తరగతి వరకు 750 మంది విద్యార్థులున్నారు. వీరికి 14 మంది ఉపాధ్యాయులు బోధిస్తున్నారు. మరో ఆరుగురు ఉపాధ్యాయులు అవసరం. దశాబ్దాల కిందట నిర్మించిన భవనాలు కావడంతో తరగతి గదుల్లో స్లాబ్‌లు పెచ్చులు విరిగిపడుతున్నాయి. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేసేందుకు ఆవరణలో ప్రత్యేకంగా గది లేకపోవడంతో వరండా, చెట్ల కిందకు వెళ్లాల్సి వస్తోంది. మరుగుదొడ్ల పరిస్థితి దారుణం. ప్రధానోపాధ్యాయుడు చొరవ తీసుకుని ఎప్పటికప్పుడు వాటిని బాగుచేయిస్తున్నారు. అధికారులు గత ఐదేళ్లలో ఒక్క రూపాయి కూడా పాఠశాల అవసరాలకు ఖర్చు చేయకపోవడం గమనార్హం.

మత్తు పదార్థాల ప్రభావం

పాఠశాల పరిసరాల్లో గంజాయి, ఇతర మత్తు పదార్థాల విక్రయం జోరుగా సాగడంతో ఆ ప్రభావం విద్యార్థులపై పడుతోంది. ఇక్కడి విద్యార్థుల్లో అత్యధిక శాతం మంది పేద, మధ్యతరగతి వర్గాల వారే. అందువల్ల ఇళ్లలో వీరిపై పర్యవేక్షణ తక్కువ. తల్లిదండ్రులు కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటారు. ఇవన్నీ విద్యార్థులు పెడమార్గం పట్టడానికి కారణమవుతున్నాయి. ఉపాధ్యాయులకు అనేక సమస్యలు ఎదురవుతున్నాయి. విద్యార్థులను సన్మార్గంలో పెట్టేందుకు ప్రత్యేక దృష్టి సారించాల్సి వస్తోంది. తరగతి గదుల్లోకి చాలామంది సెల్‌ఫోన్లు తీసుకువస్తున్నారు. గతంలో వీటిని నిరాకరించిన ఉపాధ్యాయుడితో వాగ్వాదానికి దిగిన సంఘటనలు ఉన్నాయి. మునుపటికంటే పాఠశాలలో చేరే విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది. అధికారులు, ప్రజాప్రతినిధులు పాఠశాలను సందర్శించి తగిన రక్షణ చర్యలు తీసుకుని కనీస వసతులు కల్పించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.


ఎస్పీ రామారావును సత్కరిస్తున్న నిర్వాహకులు

'జీవితంలో ఎన్నో నేర్చుకోవాలి'

సీతమ్మధార, అక్టోబరు 6: ప్రతి వ్యక్తి జీవితంలో నేర్చుకోవాల్సిన అంశాలు ఎన్నో ఉంటాయని ప్రముఖ రచయిత ఎస్పీ రామారావు అన్నారు. లంకపల్లి బుల్లయ్య కళాశాలలోని గాంధీ సెంటర్ సెమినార్ హాలులో ఆదివారం వైజాగ్ ఫిల్మ్ సొసైటీ వార్షిక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రచయిత రామారావు మాట్లాడుతూ ప్రభావవంతమైన సినిమాలు ప్రేక్షకులకు చేరవేయడంలో వైజాగ్ ఫిల్మ్ సొసైటీ పాత్ర ఎందో ఉందన్నారు. అనంతరం రామారావును నిర్వాహకులు సన్మానించారు. సొసైటీ ప్రతినిధులు నరవ ప్రకాశరావు, బి.చిన్నారావు, ఎ.కాశీవిశ్వేశ్వరరావు, ఆర్.శివకుమార్, బి.గణేశ్వర బాబ్జి పాల్గొన్నారు.

తెల్లవారుజాము వరకు ఆందోళన

▸▸ నేడు కొనసాగిస్తామన్న ఉక్కు ఉద్యోగులు

ఉక్కుటౌన్‌షిప్: విశాఖ స్టీల్‌ప్లాంట్ నాన్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగుల హెచ్‌ఆర్‌ఏలో కోత, విద్యుత్ బిల్లులపై అఖిలపక్షం ఆధ్వర్యంలో శనివారం ఈడీ (వర్క్స్) కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళన ఆదివారం తెల్లవారుజామున ఐదు గంటల వరకు కొనసాగింది. ఉక్కు యాజమాన్యం స్పష్టమైన హామీ ఇచ్చే వరకు ఆందోళన కొనసాగిస్తామని ఉద్యోగులు పెద్దఎత్తున నినాదాలు చేశారు. అయితే ఆదివారం పోరాట కమిటీ ఆధ్వర్యంలో మానవహారం చేపట్టనుండడంతో ఉదయం 5 గంటల సమయంలో విరమించారు. సోమవారం ఉదయం మళ్లీ ఈడీ (వర్క్స్) కార్యాలయం వద్ద ఆందోళన చేస్తామని ఉద్యోగులు తెలిపారు. యాజమాన్యం దిగొచ్చే వరకు ఆందోళన కొనసాగుతుందని కార్మిక నాయకులు స్పష్టం చేశారు.

ప్రీ పీహెచ్‌డీ పరీక్షలపై గందరగోళం

5వ పేజీ తరువాయి

తమ సమస్యను వివరించాలని కోరుతున్నారు.

అభ్యర్థుల్లో ఆందోళనకు కారణమిది...

టీడీఆర్ హబ్‌లో చేరిన వందలాది మంది పరిశోధక విద్యార్థులను ఓ అంశం తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత వర్సిటీకి నూతన వీసీ, రిజిస్ట్రార్లను నియమించింది. అదే సమయంలో టీడీఆర్ హబ్ ప్రవేశాల్లో అవినీతి, అక్రమాలు జరిగాయంటూ కొత్త వీసీకి వర్సిటీకి చెందిన పలువురు ఫిర్యాదు చేశారు. వాటిని పరిశీలించిన వీసీ విచారణకు కమిటీని నియమించారు. ఈ కమిటీ ప్రవేశాలకు సంబంధించిన అంశాలను పరిశీలిస్తోంది. ఈ నేపథ్యంలో 2024-25 ఏడాదికి సంబంధించి టీడీఆర్ హబ్‌లో ప్రవేశాలను నిలిపేశారు. దీంతో తమ పీహెచ్‌డీలు ఏమవుతాయోనన్న ఆందోళన పరిశోధక విద్యార్థుల్లో నెలకొంది. అయితే వర్సిటీ అధికారులు మాత్రం ప్రీ పీహెచ్‌డీ పరీక్షలు నిర్వహిస్తామంటున్నారు. ఇప్పటికే ఉన్నతాధికారులకు ఫైల్ పెట్టామని, దరఖాస్తు చేసుకున్న వారికి కొద్దిరోజుల్లోనే పరీక్షలు నిర్వహిస్తామని పేర్కొంటున్నారు. ఎప్పటిలోగా ఈ ప్రక్రియ పూర్తి చేస్తామన్న దానిపై స్పష్టతను ఇవ్వడం లేదు.


డాబాగార్డెన్స్‌లో లలితా త్రిపుర సుందరిగా ఉమాదేవికి అలంకరణ


సీతమ్మధారలో రేణుకా పరమేశ్వరి అవతారంలో దుర్గాదేవి


సీతమ్మధారలో సూర్యనారాయణునిగా వెంకటేశ్వర స్వామి



సీతంపేటలో లలిత త్రిపుర సుందరిగా పార్వతీదేవి అమ్మవారి అలంకరణ

దేవీమాతకు భక్తిశ్రద్ధలతో పూజలు

డాబాగార్డెన్స్, అక్టోబరు 6: డాబాగార్డెన్స్‌లోని శ్రీ శివరామకృష్ణ దేవాలయంలో ఉమాదేవిని ఆదివారం లలితా త్రిపుర సుందరిగా అలంకరించి భక్తులకు దర్శనావకాశం కల్పించారు. ఆలయ అర్చకుడు భార్గవశర్మ సంప్రదాయ పద్ధతుల్లో ప్రత్యేక పూజలు, కుంకుమార్చన నిర్వహించారు. మహిళలు సామూహికంగా లలితా సహస్రనామ పారాయణం చేశారు. అమ్మవారికి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. అమ్మవారికి దివ్య మంగళ హారతులిచ్చారు. భక్తులందరికీ తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ ఈవో జీవీ రమాబాయి, ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

సీతంపేట: సీతంపేట పార్వతీదేవి అమ్మవారు శ్రీ లలితా త్రిపుర సుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు శివాజి శర్మ, భాస్కర శర్మలు ప్రత్యేక అభిషేకాలు, మహిళలు కుంకుమ పూజ నిర్వహించారు.

సీతమ్మధార: సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్సన్‌లో గల ప్రసన్న వెంకటేశ్వర స్వామి, షిరిడి సాయిబాబా, అయ్యప్ప స్వామి దేవాలయంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలు, దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు కన్నుల పండువగా జరుగుతున్నాయి. వెంకటేశ్వరస్వామి వారిని సూర్యనారాయణ స్వామి అవతారంలో, దుర్గాదేవిని రేణుకా పరమేశ్వరి దేవిగా అలంకరించి భక్తులకు దర్శనావకాశం కల్పించారు. ఆలయం కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ పర్యవేక్షణలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఆలయం చుట్టూ పురవీధుల్లో గరుడ వాహనంపై ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



కారును ఢీకొన్న లారీ

ఒకరికి తీవ్ర గాయాలు



ప్రమాదంలో నుజ్జయిన కారు

కూర్మన్నపాలెం, అక్టోబరు 6: నగరంలోని జగదాంబ ప్రాంతానికి చెందిన ఐఎం రావు అనే వ్యక్తి ఆదివారం కుటుంబ సభ్యులు అనురాధ, సుజాతతో కలిసి కొవ్వూరు బయలుదేరారు. ఈ క్రమంలో సాయంత్రం అగనంపూడి సమీపంలోని దొంకాడ వద్దకు వచ్చేసరికి కారును వెనక నుంచి ఓ లారీ బలంగా ఢీకొంది. దీంతో కారు విద్యుత్ స్తంభాన్ని ఢీకొని డివైడర్‌పైకి దూసుకుపోవడంతో నుజ్జునుజ్జయింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న అనునాధ (35) కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అందించిన సమాచారం మేరకు దువ్వాడ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన ఆమెను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అనురాధ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్రీడలతోనే శారీరక ఆరోగ్యం


షటిల్ కోర్టును ప్రారంభిస్తున్న ఉషాకిరణ్, సునీల్ అగర్వాల్

కంచరపాలెం, అక్టోబరు 6: క్రీడలు మానసిక, శారీరక ఆరోగ్యం పెంచుతాయని జనసేన పార్టీ నాయకురాలు పసుపులేటి ఉషాకిరణ్ పేర్కొన్నారు. జీవీఎంసీ 47వ వార్డు రాంజీ ఎస్టేట్ పాఠశాలలో ఆదివారం నూతనంగా ఏర్పాటు చేసిన షటిల్ కోర్టును ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు అల్లుడు సునీల్ అగర్వాల్‌తో కలిసి ఉషాకిరణ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోజూ ఆటలు ఆడటం ద్వారా చక్కని ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవచ్చన్నారు. కార్పొరేటర్ కంటిపాము కామేశ్వరి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు బొడ్డేపల్లి రఘు, గురువోజి, నరిసింగ్, ఏడుకొండలు, లక్ష్మణ్, బాబు పాల్గొన్నారు.



మళ్లీ మొదటికి?

5వ పేజీ తరువాయి


చేశారు. అయితే టెండర్లు ఖరారైన తరువాత ఓ వైసీపీ నేత ఒత్తిడితో కాంట్రాక్టరు పనులు చేపట్టేందుకు ముందుకురాలేదు. తరువాత రెండుమూడు సార్లు టెండర్లు పిలిచినా ఎవరూ బిడ్ వేయలేదు. అయితే ఈ ఏడాది జనవరిలో వంతెన నిర్మాణ ప్రతిపాదనలను సవరించి రూ.16 కోట్లకు పెంచి టెండరు ఖరారుచేశారు. అనంతరం మరోసారి శంకుస్థాపన చేశారు. ఈలోగా ఎన్నికలు రావడంతో పనులు ప్రారంభించలేదు. ఇప్పటి వరకు ప్రారంభించని పనులు రద్దుచేయాలని ప్రభుత్వం నిర్ణయించడంతో పాండ్రంగి వంతెన పనులు టెండరు రద్దయింది. కొత్తగా వంతెన నిర్మాణం చేయాలంటే మరోసారి టెండరు విలువ పెంచాలని పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు పేర్కొంటున్నారు. కొత్త రేట్ల ప్రకారం రూ.17 కోట్లు అవసరమవుతుందని అంచనా వేశారు. స్థానికంగా ప్రజలు, ప్రజాప్రతినిధుల నుంచి ఒత్తిడివస్తే ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వం నుంచి ఆమోదం లభించిన తరువాతే టెండర్లు పిలుస్తామని, అందుకు కొంత సమయం పడుతుందని చెబుతున్నారు.

కాగా పద్మనాభం మండలం పాండ్రంగి వద్ద గోస్తని నదిపై ఇప్పటికే కాజ్‌వే ఉంది. దీని పైనుంచే పాండ్రంగి- పద్మనాభం రాకపోకలు సాగుతున్నాయి. వర్షాకాలంలో తగరపువలస వచ్చి జాతీయ రహదారి మీదుగా వంతెన దాటి పద్మనాభం వెళ్లాల్సి ఉంటుంది. అందుకే ఈ వంతెన నిర్మించాలని పాండ్రంగి, పరిసర గ్రామాల ప్రజలు ఏళ్లుగా పోరాడుతున్నారు.

రూ.86.24 లక్షల చోరీసొత్తు రికవరీ

... 5వ పేజీ తరువాయి

చుట్టామన్నారు. సాధారణంగా రికవరీ చేసిన సొత్తును బాధితుడికి అందజేసేందుకు అనుమతించాలంటూ కోర్టులో పిటిషన్ వేస్తామన్నారు. కోర్టు అనుమతించిన తర్వాత బాధితుడు ష్యూరిటీ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. దీనిని అధిగమించేందుకు సొత్తు రికవరీ అయినవెంటనే కోర్టు అనుమతితో బాధితుడికి అందజేసేలా చర్యలు తీసుకున్నామన్నారు. దీనివల్ల బాధితులకు ఆనందంతోపాటు పోలీస్‌స్టేషన్లలో సొత్తుని భద్రపరిచే పరిస్థితి ఉండదన్నారు. సమావేశంలో క్రైమ్ డీసీపీ లతామాధురి, ఏసీపీ వెంకటరావు, సీఐలు జి.శ్రీనివాస్, నిమ్మకాయల శ్రీనివాస్, కోరాడ రామారావు, కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా జర్నలిస్టుల దసరా సంబరాలు



బాలికల సాంస్కృతిక నృత్యం

డాబాగార్డెన్స్, అక్టోబరు 6: ఏపీ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్, ఏపీ బ్రాడ్ కాస్ట్ జర్నలిస్టుల అసోసియేషన్, ఏపీ స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో దసరా సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విమ్స్ డైరెక్టర్ కె.రాంబాబు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విమ్స్‌లో జర్నలిస్టులకు ఉచిత సేవలు అందిస్తామన్నారు. ఏపీ వర్కింగ్ జర్నలిస్టల ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఆంజనేయులు, జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, నగర అధ్యక్షుడు పి.నారాయణ్, ఫోటో జర్నలిస్టుల అసోసియేషన్ అధ్యక్షుడు వై.రామకృష్ణ పాల్గొన్నారు. సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. జర్నలిస్టులకు మిఠాయిలు, లక్కీడీప్ ద్వారా ఎంపికైన వారికి బహుమతులు అందజేశారు.


శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా సీతమ్మధార ఆక్సిజన్ టవర్స్‌లోని అపార్ట్‌మెంట్‌లో దాండియా నృత్యం చేస్తున్న యువతులు

బీజేపీ సభ్యత్వ నమోదు

అక్కయ్యపాలెం, అక్టోబరు 6: గ్రేటర్ 44వ వార్డు బీజేపీ అధ్యక్షుడు రఘునాథ్ ఆధ్వర్యంలో 123, 125 పోలింగ్ బూత్‌ల పరిధిలో ఆదివారం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల అధ్యక్షురాలు మళ్ల లక్ష్మి, సీతారాములు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు సీఐ కౌన్సెలింగ్

సీతంపేట, అక్టోబరు 6: ప్రతి ఒక్కరూ సత్ప్రవర్తనతో నడవాలని, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని నాలుగో పట్టణ సీఐ విజయ్‌కుమార్ హెచ్చరించారు. ఆదివారం నాలుగో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎస్ఐ వెంకటరావ పాల్గొన్నారు.

ఎలుగెత్తిన కార్మిక గళం

... 5వ పేజీ తరువాయి

స్తంభించాయి. రాస్తారోకోలో పాల్గొన్న కార్మిక సంఘ నాయకులను ఏసీపీ టి.త్రినాథ్ ఆధ్వర్యంలో పోలీసులు అరెస్టు చేసి, స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంటు రోజురోజుకు రావణకాష్టంగా మారుతోందన్నారు. సీపీఎం కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంటుకు ఆర్థిక సాయం అందించి, సొంత గనులు కేటాయించాలని ఏళ్లుగా దీక్షలు చేస్తుంటే ఇప్పుడు మీకేం కావాలో చెప్పండంటూ చర్చలకు పిలవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కార్మికులను నిర్బంధించాలని చూస్తున్న ప్రభుత్వాలకు బుద్ధివచ్చేలా చేస్తామన్నారు. ఉక్కును ప్రభుత్వరంగంలో కొనసాగించి, సెయిల్‌లో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ, నిర్వాసిత నాయకులు డి.ఆదినారాయణ, ఎన్.గంగారామ్, పులి వెంకటరమణారెడ్డి, కేఎస్ఎన్ రావు, ఎన్.రామారావు, నీరుకొండ రామచంద్రరావు, జె.త్రిపోతుల ముత్యాలు, బొడ్డు పైడిరాజు, విళ్ల రామ్మోహన్ కుమార్, దొమ్మేటి అప్పారావు, పెంటారావు, శ్రీనివాసులు నాయుడు, ప్రగడ వేణుబాబు, పీవీ రమణ, యు.రామస్వామి, వి.ప్రసాద్, వేంకటేశ్వరరావు, గంగవరం గోపి, మాటూరి రాము, గణపతి రెడ్డి, రమణ, గుమ్మడి నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ANDHRA JYOTHI CLASSIFIEDS

WANTED

★ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను / పేషంట్స్ / చంటి పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం కలదు. జీతం 18k. Ph:9640258899, 9640468899 AJH-15274

For Advertisement Contact :
9963231176
9966165093

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

ఉచిత వైద్య శిబిరం

పూర్ణామార్కెట్ అక్టోబరు 6: వన్‌టౌన్ పాతపోస్టాఫీసు వద్ద ఇతిహాద్ ముస్లీం కమ్యూనిటీ, హుస్సేన్ ట్రస్ట్ సంయుక్తంగా మోహదీ భవనం వద్ద ఆదివారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. దీన్ని ప్రముఖ వ్యాపారవేత్త అమీద్ అలీఖాన్ ప్రారంభించారు. అపోలో వైద్యుల సౌజన్యంతో ముస్లీం కుటుంబాలకు వైద్యసేవలు అందజేశారు 111 మందికి వైద్యులు సేవలందించారు. ఇత్తిహాద్ ముస్లీం కమ్యూనిటీ అధ్యక్షుడు ఐహెచ్ ఫరూక్, వైద్యులు పాల్గొన్నారు. రోగులకు ట్రస్ట్ ద్వారా ఉచితంగా మందులు అందజేశారు.

'కార్మికవర్గాన్ని ఐక్యం చేయాలి'


లెనిన్, సీతారాం ఏచూరి చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న ప్రొఫెసర్ ప్రభాత్ పట్నాయక్, జగ్గునాయుడు, శ్రీనివాసరావు తదితరులు

డాబాగార్డెన్స్, అక్టోబరు 6: సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా కార్మికవర్గాన్ని ఐక్యం చేయాలని జేఎన్‌యూ డిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ ప్రభాత్ పట్నాయక్ పిలుపునిచ్చారు. డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఆదివారం లెనిన్ శతవర్ధంతి సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా హాజరై ఆయన ముందుగా లెనిన్, సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్మికవరం ఎలా ఉండాలో కమ్యూనిస్టు పార్టీ నిర్మాణం చేసి చూపిన మహోన్నత వ్యక్తి లెనిన్ అని కొనియాడారు. ప్రభుత్వ రంగ సంస్థలు ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్లి నిరుద్యోగం మరింత పెరుగుతుందన్నారు. ఇతర దేశాల నుంచి సరుకులు దిగుమతి చేసుకోవడంతో మన దేశ పంటకు రేటు తగ్గిపోతుందన్నారు. ఉద్యమాలు జరిగేచోట వామపక్ష భావజాలంతో ఉన్నవారు అధికారంలోకి వస్తున్నారని గుర్తుచేశారు. కార్యక్రమానికి సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు అధ్యక్షత వహించగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ, కె.లోకనాథం, కృష్ణమూర్తి, గంగారావు తదితరులు పాల్గొన్నారు.

నాగమయ్యపాలెం ఉప్పుటేరులో పడవల నిలిపివేత



భీమునిపట్నం (రూరల్), అక్టోబరు 6: నాగమయ్యపాలెంలో ఉప్పుటేరును పడవల నిలిపివేతకు అనుకూలంగా తీర్చిదిద్దుతున్నారు. ఈ గ్రామంలో అంతా మత్స్యకారులే. అత్యధికులు ప్రతిరోజూ పడవలపై వేటకు వెళుతుంటారు. వారి పడవలు మాత్రం భీమిలి ఉప్పుటేరు ప్రాంతంలో ఉంచుతారు. ఇక్కడ గోస్తనీ నది సంగమం ఉండడంతో దీని నుంచి పడవలు నేరుగా సముద్రంలోకి వెళ్లడానికి అవకాశం ఉంటుంది. ప్రతిరోజూ తెల్లవారుజామున నాగమయ్యపాలెం నుంచి భీమిలి వచ్చి పడవలను సముద్రంలోకి తీసుకువెళ్లి మళ్లీ అదేవిధంగా వచ్చి పడవలను నిలుపుదల చేసి, ఇళ్లకు చేరుకుంటారు. ఇది వారికి ఇబ్బందికరంగా మారడంతో నాగమయ్యపాలెం గోస్తనీ నది వద్ద ఉప్పుటేరుగా ఉన్న ప్రాంతంలో పడవల నిలిపివేతకు తగిన సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇక్కడి నుంచి నేరుగా సముద్రంలోకి వెళ్లడానికి అవకాశం ఉంది. అయితే లోతు తక్కువగా ఉండడం వల్ల కొన్నిసార్లు పడవల నిలిపివేతకు కష్టం అవుతోందని మత్స్యకారులు చెబుతున్నారు. పాలకులు, అధికారులు స్పందించి ఈ ప్రాంతంలో పూడిక తీసి లోతు చేస్తే పడవలను శాశ్వతంగా నిలిపి ఉంచడానికి అవకాశం ఉంటుందని కోరుతున్నారు.

నిర్వహణకు నోచని కూడళ్ల సర్కిళ్లు

- లక్షలాది రూపాయల ప్రజా ధనం వృథా
- జీవీఎంసీ అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు

ఎంవీపీ కాలనీ, అక్టోబరు 6 : నగరంలోని పలు కూడళ్ల సర్కిళ్లు కనీస నిర్వహణకు నోచుకోవడం లేదు. వీటిని ఏ ఉద్దేశంతో నిర్మించారో అది నెరవేరడం లేదు సరికదా, తాజాగా కొన్ని సర్కిళ్ల వద్ద స్మార్ట్ సిటీ నిధులతో గత ప్రభుత్వంలో జీవీఎంసీ చేసిన పనులు కూడా ఏమాత్రం అక్కరకు రాలేదు.ఎంవీపీ కాలనీలో నాలుగు రోడ్ల కూడళ్లలో సర్కిల్ పార్కులు ఉన్నాయి. ఆధునికీకరణ పనుల పేరిట కూడళ్ల బ్యూటిఫికేషన్ చేపట్టారు. పనుల్లో లోపాలు, నిర్వహణ లోపం వల్ల ఇవి ఏమాత్రం అందాన్ని ఇవ్వడం లేదు. ఓ సర్కిల్ వద్ద స్థానికులు తరచూ భారీ హోర్డింగ్‌లు ఏర్పాటు చేసి, వాహనదారులకు ఇబ్బంది కలిగిస్తున్నా.. పట్టించుకునే నాథుడే లేడు. మరో సర్కిల్ వద్ద వాటర్ ఫౌంటెన్ ఏర్పాటు చేసినా, ఆకర్షణగా కనిపించడం లేదు. ఏఎస్ రాజా కూడలి వద్ద సర్కిల్‌ను రూ. 1.29 కోట్లతో అభివృద్ధి చేసి, చుట్టూ కాబుల్ స్టోన్ ఫ్లోరింగ్, సర్కిల్ మధ్యలో ఐ ల్యాండ్‌ను గ్రానైట్‌తో తీర్చిదిద్దారు. నిర్వహణ లోపంతో ఇవి కళా విహీనంగా కనిపిస్తున్నాయి. కాబుల్ స్టోన్‌తో నిర్మించిన ఫ్లోరింగ్ ఇప్పటికే అక్కడక్కడ ఊడిపోయింది. వర్షాలకు మరిన్ని గోతులు పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రజా ధనాన్ని విచ్చలవిడిగా ఖర్చు చేసినా, నిర్వహణ లేకపోతే అవి బూడిదలో పోసిన పన్నీరుగానే మిగిలిపోతాయి. ఇప్పటికైనా అధికారులు శ్రద్ధ చూపి, కూడళ్ల సర్కిళ్లను ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని పలువురు కోరుతున్నారు.


కళా విహీనంగా కనిపిస్తున్న ఎంవీపీ కాలనీ ప్రధాన కూడలిలో సర్కిల్


కాలువలో పేరుకుపోయిన పూడిక

సాగర్‌నగర్‌లో పారిశుధ్య లోపం

సాగర్‌నగర్, అక్టోబరు 6 : సాగర్‌నగర్‌లో పారిశుధ్యం క్షీణించింది. హెచ్‌బీజీ టు బాస్కెట్ బాల్ పార్కు వెనుక ఉన్న గృహాల సముదాయం వద్ద ఉన్న డ్రైనేజీ పూర్తిగా దెబ్బతింది. నివాసితులు కాలువలపై పలకలు వేయడంతో పారిశుధ్య సిబ్బంది మురుగు, చెత్త తొలగించడానికి వీలు కావడం లేదు. దీంతో నెలలు తరబడి కాలువల్లో పూడిక తీయకపోవడంతో ఇళ్ల వద్ద ఉన్న బోరు బావుల్లోకి మురుగు చేరి తాగునీరు కలుషితమవుతోంది. అలాగే పూడిక వల్ల దోమల వ్యాప్తి అధికం కావడంతో పాటు విపరీతమైన దుర్వాసన వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాలకులు, అధికారులు తక్షణమే స్పందించి కాలువల్లో పూడిక తీతకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన

మధురవాడ, అక్టోబరు 6 : శిల్పారామంలో దసరా ఉత్సవాల్లో భాగంగా ఆదివారం నగరానికి చెందిన కిరణ్మయి నృత్యనికేతన్ కళాకారులు ప్రదర్శించిన శాస్త్రీయ నృత్యాలు ప్రేక్షకులను అలరించాయి. కళాకారులు శ్రావ్య లక్ష్మీ, దీక్షిత తదితరులు పలు కీర్తనలకు నృత్యం చేయగా, కిరణ్మయి దర్శకత్వం వహించారు.

అప్పన్నకు స్వర్ణ పుష్పార్చన



సింహాచలం, అక్టోబరు 6 : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా స్వర్ణ పుష్పార్చన ఆదివారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఆలయ పద్మనిధి నుంచి పసిడి కుసుమాలు తీసి భక్తులతో స్పృశింపజేసి బేడామండప ప్రదక్షిణ చేసిన తరువాత ఉత్సవ మూర్తి గోవిందరాజస్వామిని భూ, నీలదేవి సమేతంగా ప్రత్యేక వేదికపై అధిష్టింపజేశారు. అనంతరం నారసింహ అష్టోత్తర శతనామార్చన పఠిస్తూ అన్ని నామాలకు పసిడి సంపెంగ పూలతో పూజ చేశారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు. అనంతరం అదే వేదికపై ఆర్జిత నిత్య కల్యాణం నిర్వహించారు.

పబ్లిక్ హెల్త్ కాన్ఫరెన్స్‌లో ఏయూ రిజిస్ట్రార్

విశాఖపట్నం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : ప్రజారోగ్యంపై బ్యాంకాంగ్‌లో జరుగుతున్న గ్లోబల్ హెల్త్ కాన్ఫరెన్స్‌లో ఏయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఈఎస్ ధనుంజయరావు వర్చువల్‌గా శనివారం పాల్గొన్నారు. సదస్సులో భాగస్వామ్యమైన శ్రీలంకకు చెందిన ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ నాలెడ్జ్ మేనేజ్‌మెంట్ (టీఐకేఎం) ప్రతినిధులతో ధనుంజయరావు పలు అంశాలపై చర్చించారు. ఈ సదస్సులో వివిధ దేశాలకు చెందిన పలువురు పాల్గొని పబ్లిక్ హెల్త్ ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. ప్రజారోగ్యానికి అంతర్జాతీయ సంస్థలతో కలిసి నడుస్తామని ఈసందర్భంగా రిజిస్ట్రార్ పేర్కొన్నారు.

కిటకిటలాడిన జూపార్కు

ఆరిలోవ, అక్టోబరు 6 : ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాల సందర్శకులతో ఆదివారం కిటకిటలాడింది. 6,400 మంది జూను సందర్శించగా వారి నుంచి రూ. 4.50 లక్షల మేర ఆదాయం సమకూరినట్టు అధికారులు తెలిపారు.

సినిమా గైడ్

- **శ్వాగ్:** శ్రీవెంకటేశ్వర, శ్రీరామ, శ్రీకన్య శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్-2 (పెందుర్తి), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **దక్షిణ :** కిన్నెర, శారద, గోకుల్, శ్రీనరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య హెవెన్ (గాజువాక), తాతా (తగరపువలస)
- **రామ్‌నగర్ బన్నీ:** రమాదేవి, విశేష్ (గాజువాక)
- **దేవర :** మెలోడి, జగదాంబ, శరత్, కామేశ్వరి, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), కన్య కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1 (పెందుర్తి), రాములమ్మ (తగరపువలస)
- **సత్యం సుందరం :** సంగం, వెంకటేశ్వర, కిన్నెర, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), గణేష్ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 49, టమాటా 72, వంకాయలు (తెలుపు) 30, వంకాయలు (నలుపు) 54, బెండకాయలు 34, పచ్చిమిర్చి 40, కాకరకాయలు 46, బీరకాయలు 55, ఆనపకాయలు 24, కాలీఫ్లవర్ 44, క్యాబేజి 20, క్యారెట్ 48 దొండకాయలు 60, బంగాళదుంపలు 30, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 95, అల్లం (పాతది) 85, బరబటి 46, ముల్లంగి 32, నిమ్మకాయలు (కిలో) 84, గోరుచిక్కుడు 38, దోసకాయ 36, వెల్లుల్లి (పెద్దవి) 280, కొబ్బరికాయ (పెద్దది) 26, బీన్స్ (పెన్సిల్) 98, పొటల్స్ 36, కీరదోస 32, కాప్సికమ్ 66, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 46, చిలగడదుంపలు 44, కంద 62, దేముడు చిక్కుడు 64, కొండఉసిరి 85, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాల కూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 5, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, కర్ర పెండలం 30, మామిడి అల్లం 90, బొప్పాయి 35, జామ కాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	525
విజయనగరం	529
శ్రీకాకుళం	529

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	-- 110
ఫారం ధర	-- 130
విత్ స్కిన్	-- 230
స్కిన్‌లెస్	-- 240

మరికొన్ని సిటీ వార్తలు పేజీ 10 లో..


రికార్డులను పరిశీలిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి

జోన్-1 ట్రాఫిక్ కార్యాలయాన్ని సందర్శించిన సీపీ

ఎండాడ, అక్టోబరు 6 : జోన్-01 ట్రాఫిక్ ఏసీపీ కార్యాలయాన్ని సీపీ శంఖబ్రత బాగ్చి ఆదివారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ట్రాఫిక్‌కి సంబంధించిన పలు ఫైళ్లను పరిశీలించారు. జోన్-1 పరిధిలో కేసుల రికార్డులు, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా అధికారులు సత్వరమే చర్యలు తీసుకోవాలని సూచించారు. నగర పరిధి పెరిగిందని, ట్రాఫిక్‌పై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు.

21 నుంచి మరిడిమాంబ ఉత్సవాలు

భీమునిపట్నం, అక్టోబరు 6 : పట్టణంలోని నాగవంశీయుల ఆరాధ్య దేవత మరిడిమాంబ అమ్మవారి ఉత్సవాలు ఈనెల 21 నుంచి 23 వరకు నిర్వహించనున్నారు. ఈమేరకు సోమవారం సాయంత్రం అమ్మవారిని ఆలయం నుంచి కాళ్ల వీధిలో వున్న సదురుపట్టుకు తీసుకురానున్నారు. ఆదివారం స్థానిక మరిడిమాంబ అమ్మవారి ఆలయంలో ఆలయ ధర్మకర్త గాడు అప్పలనాయుడు సమక్షంలో ఆ కులస్థులంతా సమావేశమయ్యారు. 21న తొలేళ్ల ఉత్సవం, 22న సాయంత్రం అనుపోత్సవం నిర్వహించాలని తీర్మానించారు. ఈ సమావేశంలో నాగవంశీయ సంక్షేమ సంఘం నాయకులు కె. ముత్యాలరావు, కంటుభుక్త రామానాయుడు, గాడు సన్యాసినాయుడు, సంకురుభుక్త జోగారావు, రాంభుక్త ప్రభాకరనాయుడు, కాళ్ల శ్రీనివాసరావు, లచ్చుభుక్త ఆదినారాయణ, కనకల సన్నిబాబు, లచ్చుభుక్త మురళీ, జరజాపు పాపారావు, తాలాడ అచ్చిబాబు, మొకర రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు కేజీబీవీ బాలిక

పద్మనాభం, అక్టోబరు 6 : పద్మనాభంలోని కస్తూరిబాగాంధీ బాలికల విద్యాలయంలో పదో తరగతి చదువుతున్న జి.రమ్యశ్రీ రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికైంది. ఉమ్మడి విశాఖ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఏయూ హైస్కూల్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి తైక్వాండో పోటీల్లో ఆమె విజేతగా నిలవడంతో రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించింది. ఈమేరకు తిరుపతిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో బాలిక పాల్గొనున్నట్టు విద్యాలయం ప్రిన్సిపాల్ గ్రేస్ లిల్లీ తెలిపారు.

రాజీవ్‌నగర్‌లో అన్నసమారాధన

ఎండాడ, అక్టోబరు 2 : జీవీఎంసీ 8వ వార్డు రాజీవ్‌నగర్‌లో గోపాలకృష్ణ యూత్ ఆధ్వర్యంలో జరుగుతున్న నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అన్నసమారాధన నిర్వహించారు. సుమారు మూడు వేల మంది భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు చెట్టుపల్లి గోపి, లొడగల రామ్మోహన్, ఒమ్మి బాబూరావు, శ్రీను, అప్పలనాయుడు, గోపాలకృష్ణ, పోలిరాజు తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా బీజేపీ సభ్యత్వ నమోదు

ఆనందపురం, అక్టోబరు 6 : మండలంలో బీజేపీ సభ్యత్వ నమోదు ముమ్మరంగా సాగుతోంది. పార్టీ జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు పీవీవీ ప్రసాదరావు పట్నాయక్, మండల ఇన్‌చార్జి ఉప్పాడ అప్పారావు, మండల పార్టీ అధ్యక్షుడు మీసాల రాము నాయుడు ఆధ్వర్యంలో శనివారం 83, 89, 90 బూత్‌లలో సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల స్థాయిలో బీజేపీకి అత్యధిక సభ్యత్వ నమోదుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మాదాబత్తుల బుజ్జి (వెల్లంకి), మీసాల రామునాయుడు (ఆనందపురం), కార్యకర్తలు రామ్‌సింగ్, రమేశ్, చైతన్య వర్మ, తదితరులు పాల్గొన్నారు.

మద్దిలపాలెంలో వాహన తనిఖీలు

మద్దిలపాలెం, అక్టోబరు 6 : మద్దిలపాలెం కూడలిలో ట్రాఫిక్ పోలీసులు ఆదివారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. హెల్మెట్ ధరించని వారిపై కేసులు నమోదు చేశారు. అలాగే ట్రిబుల్ రైడింగ్, రాష్ డ్రైవింగ్ చేసిన వారిని తనిఖీలు చేశారు. నిబంధనలు పాటించని వారి లైసెన్స్‌లు సీజ్ చేశారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

తగరపువలస, అక్టోబరు 6 : చిట్టివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. 1979లో ఈ పాఠశాలలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు డి. చలపతిరావు అధ్యక్షతన కలిశారు. పేద విద్యార్థులను ఆదుకోవాలని, పాఠశాలకు సదుపాయాలు కల్పించాలని తీర్మానించారు. అనంతరం ప్రధానోపాధ్యాయుడు మురళీమోహన్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు గోపాలం, నాగరాజు, సుగుణాకరరావు, సూర్యనారాయణ పాల్గొన్నారు.


అభివృద్ధి పనులపై చర్చిస్తున్న పర్యాటక, దేవదాయశాఖ అధికారులు

ప్రసాద్ పథకం పనులను వేగవంతం చేయండి - ఏడీసీ రామచంద్రమోహన్

సింహాచలం, అక్టోబరు 6 : కేంద్ర ప్రభుత్వం ప్రసాద్ పథకం కింద రూ. 54 కోట్లతో సింహగిరిపై చేపట్టిన పనులను వేగవంతం చేయాలని దేవదాయశాఖ రాష్ట్ర అదనపు కమిషనర్ కోదూరి రామచంద్రమోహన్ అన్నారు. ఆదివారం ఆయన సింహగిరిపై దేవస్థానం, పర్యాటక శాఖ అధికారులతో ప్రసాద్ పథకం పనులపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులు భక్తులను దృష్టిలో ఉంచుకుని జరగాలన్నారు. సింహగిరి బస్టాండ్‌లో బస్‌బే నిర్మాణం వల్ల స్వామివారి వార్షిక ఉత్సవాలైన చందనోత్సవం, గిరి ప్రదక్షిణ సమయంలో ఇబ్బందులు తలెత్తే అవ కాశం ఉందని, అక్కడ ఖాళీ స్థలం ఉంచాలని సూచించారు. ఈ సమావేశంలో ఈఓ వేంద్ర త్రినాథరావు, కార్యనిర్వాహక ఇంజినీర్లు దండు గణశ్రీనివాసరాజు, బండారు రాంబాబు, పర్యాటక శాఖ ఏఈ మదన్‌మోహన్, తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

భీమునిపట్నం, అక్టోబరు 6 : పట్టణంలోని జోనల్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్టు జడ్సీ పి. ప్రేమ ప్రసన్న వాణి తెలిపారు. ఆదివారం ఆమె ప్రకటన విడుదల చేశారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 వరకూ కార్యాలయంలో ఫిర్యాదులు స్వీకరిస్తామని, ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


ఆశీలు వసూళ్లకు బహిరంగ వేలం నేడు

భీమునిపట్నం, అక్టోబరు 6 : పట్టణంలోని జీవీఎంసీ దుకాణాలను మూడేళ్ల కాలపరిమితికి అద్దెకు ఇవ్వడంతో పాటు రోడ్ మార్జిన్, లాల్ బహదూర్‌శాస్త్రి, చిన్నబజారు కలిగొట్ల సూర్యనారాయణనాయుడు మార్కెట్‌లలో ఆశీలు వసూలుకు సోమవారం బహిరంగ వేలం నిర్వహించనున్నట్టు జడ్సీ ప్రేమ ప్రసన్న వాణి తెలిపారు. ఆదివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. మధ్యాహ్నం 3 గంటలకు జోనల్ కార్యాలయంలో వేలం ప్రారంభమవుతుందన్నారు. ఆసక్తి గల వారు వేలంలో పాల్గొనాలని ఆమె కోరారు.

ఫార్మకో విజిలెన్స్‌తో రోగులకు భద్రత


ముగింపు సదస్సులో పాల్గొన్న ఫార్మకాలజిస్ట్ సొసైటీ సభ్యులు

ఎండాడ, అక్టోబరు 6 : రోగులు ఔషధాలను సురక్షిత రీతిలో వినియోగించడంలో సాంకేతిక ఆధారిత ఫార్మకో విజిలెన్స్ కీలక పాత్ర పోషిస్తోందని ఐక్యూవీఐఏ సంస్థ ఆసియా ప్రాంత వైద్య సురక్షిత విభాగాధిపతి, రిటైర్డు మేజర్ డాక్టర్ కాంతి తెలిపారు. గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ (జిమ్‌సర్)లో నిర్వహిస్తున్న ఏపీ ఫార్మకాలజిస్ట్ సొసైటీ జాతీయ స్థాయి ముగింపు సదస్సులో ఆదివారం ఆయన మాట్లాడారు. ఫార్మకోవిజిలెన్స్ రంగంలో భవిష్యత్తులో కృత్రిమ మేధ వినియోగం, యువతలో ప్రతిభను పెంపొందించడం ద్వారా రోగులకు మరిన్ని ఉత్తమ సేవలు అందించవచ్చని చెప్పారు. బీకే రాయ్ రీసెర్చ్ సెంటర్ (కోల్‌కతా) క్లినికల్ డైరెక్టర్ సుబ్రోజ్యోతి బౌమిక్ మాట్లాడుతూ వైద్య సేవలందించే సమయంలో మెడికేషన్ ఎర్రర్ రిపోర్టింగ్ సిస్టమ్ (ఎంఈఆర్ఎస్) ప్రాధాన్యతను వివరించారు. వైద్య నివేదికలు రూపొందించే ప్రక్రియలో వివిధ దశల్లో తప్పులు జరిగే అవకాశం ఉందన్నారు.ఈక్రమంలో ఆరోగ్య నిపుణుల కోసం ఎంఈఆర్ఎస్‌పై క్రమం తప్పకుండా శిక్షణలు నిర్వహించాలన్నారు. ఈ సదస్సులో జిమ్‌సర్ వైద్య నిపుణులు, ప్రొఫెసర్లు తులసీ మాధురీ అధ్యాపకులు శ్యామ్‌కుమార్, సింధూర, పూజిత, కృష్ణసాయి, విస్నీలా పలు వైద్య కళాశాలల పీజీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


ఎండాడ : లలితా త్రిపుర సుందరిగా నిమ్మకాయలతో అలంకరణ


జిమ్‌సర్‌లో అన్నపూర్ణాదేవిగా పూజలందుకున్న రాజరాజేశ్వరీ దేవి


భీమిలి : లలితా త్రిపుర సుందరి అలంకారంలో పద్మావతి అమ్మవారు


ఆరిలోవ :దీనదయాళపురంలో విజయ దుర్గాదేవి ఆలయంలో అలంకరణ


కొమ్మాది : బాలా త్రిపుర సుందరీదేవిగా దుర్గాలమ్మ అమ్మవారు


సింహాచలంలో అమ్మవారి అలంకరణ

లలితా త్రిపుర సుందరీదేవిగా దుర్గమ్మ

ఎండాడ/సింహాచలం/భీమునిపట్నం/కొమ్మాది/ఆనందపురం, అక్టోబరు 6 : తూర్పు, భీమిలి నియోజకవర్గాల్లోని పలు ప్రాంతాల్లో శరన్నవ రాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని ఆదివారం లలితా త్రిపుర సుందరీదేవిగా అలంకరించారు. ఈ సందర్భంగా మహిళలు అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. కాగా సింహాద్రినాథుడి సన్నిధిలో జరుగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం అమ్మవార్ల తిరువీధి వైభవంగా జరిపారు. సువర్ణ, చతుర్భుజి అమ్మవార్ల ఉత్సవమూర్తులను శోభాయమానంగా అలంకరించి పల్లకిలో ఉంచారు. ఆలయ విద్వాంసుల నాదస్వరాలపనలు, పండితులు వేదమంత్రోచ్చారణల నడుమ బేడా మండపంలో తిరువీధి జరిపారు. ఈ సందర్భంగా మార్గం పొడవునా అష్టదిక్కాలకు ప్రత్యేక పూజలు చేసి నివేదనలు ఇచ్చారు. అలాగే సాగర్‌నగర్ మొగధారమ్మ మహాలక్ష్మీ పద్మాలయంలో చండీ హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ చైర్మన్ సూరపనేని లక్ష్మీప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.


మంత్రి దుర్గేశ్‌ను సన్మానిస్తున్న బోసుబాబు, పక్కన ఎమ్మెల్యే గంటా

మంత్రి కందులకు సన్మానం

ఆనందపురం, అక్టోబరు 6 : రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేశ్‌కు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శనివారం ఘన సన్మానం జరిగింది. విశాఖకు వచ్చిన దుర్గేశ్‌ను స్థానిక మహాలక్ష్మి కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఘట్టమనేని సుభాష్ చంద్రబోస్ ఇక్కడికి ఆహ్వానించారు. ఈమేరకు మంత్రి గిడిజాలలో ఉన్న ఘట్టమనేని ఎస్టేట్స్‌కు రాగా మిత్రులంతా ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, బోసుబాబు ఆధ్వర్యంలో మంత్రికి శాలువా కప్పి సన్మానించారు.

అమ్మవారి ఘటాల ఊరేగింపు


అమ్మవారి ఘటాలను ఊరేగిస్తున్న మహిళలు

మధురవాడ, అక్టోబరు 6 : బైలర్స్ కాలనీలోని విజయదుర్గాదేవి ఆలయంలో జరుగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి ఘటాలను ఆదివారం ఊరేగించారు. ఆలయ ధర్మకర్తలు బంగారు సుబ్బారావు, లక్ష్మీ దంపతులు ముందుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బంగారు అశోక్ కుమార్, ఝాన్సీ దంపతులు దీపారాధన చేసి, పల్లకీ సేవ ప్రారంభించారు. కోలాటాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో వీధుల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

వృత్తి విద్యతో ఉపాధి అవకాశాలు : జీసీడీఓ


విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ సామగ్రి పంపిణీ చేస్తున్న జీసీడీఓ బేగం

పద్మనాభం, అక్టోబరు 6 : వృత్తి విద్య అభ్యసించడం వల్ల ఎక్కువ ఉపాధి అవకాశాలు పొందవచ్చని జిల్లా బాలికా సంరక్షణ అధికారి (జీసీడీఓ) కాలెషా బేగం అన్నారు. రేవిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీఎం శ్రీ ద్వారా అమలవుతున్న వృత్తి విద్యా శిక్షణను ఆదివారం ఆమె పరిశీలించారు.ఆటో మొబైల్ షాప్, ఫ్యాషన్ టైలరింగ్‌లో ఇంటర్న్‌షిప్ ద్వారా శిక్షణ పొందుతున్న వారికి సామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఒకేషనల్ జిల్లా కోఆర్డినేటర్ రిషికేష్, పాఠశాల హెచ్‌ఎం శంకరరావు, వృత్తి విద్యా శిక్షకులు కిరణ్, కల్యాణి, మాధవి పాల్గొన్నారు.

రోడ్డుపై చెట్టు కొమ్మలు.. పట్టించుకోని జీవీఎంసీ


రోడ్డు పక్కనున్న ఎండిపోయిన చెట్టు కొమ్మలు

మద్దిలపాలెం, అక్టోబరు 6 : జీవీఎంసీ 22వ వార్డు పిఠాపురం కాలనీలో కళాభారతి ఎదురు వీధిలో రోడ్డుపై ఉన్న చెట్టు కొమ్మల తొలగింపులో పారిశుధ్య సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఇక్కడ చెట్టు కొమ్మలు పెరిగి గుబురుగా ఉండడంతో రాత్రి వేళ మందుబాబులు మద్యం సేవిస్తూ అల్లర్లు సృష్టిస్తున్నారు. దీంతో స్థానికులు కొమ్మలు తీయించారు. అవి ఎండిపోయి రోడ్డుపై పేరుకుపోయాయి. పారిశుధ్య సిబ్బంది కొమ్మలను ఎత్తి వ్యాన్‌లో వేసిన అనంతరం స్థానికులకు రూ. 500 ఇవ్వాలని డిమాండ్ చేశారు. డబ్బులు ఎందుకు ఇవ్వాలని వారు ప్రశ్నించగా కొమ్మలు తీస్తున్నందుకు ఇవ్వాలని బదులిచ్చారు. తాము ఇవ్వమని చెప్పడంతో పారిశుధ్య సిబ్బంది వ్యాన్‌లోని కొమ్మలను మళ్లీ రోడ్డుపై పడేసి వెళ్లిపోయారు. ఈ విషయమై స్థానికులు జోన్-3 కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. అయినా సరే సిబ్బంది పట్టించుకోకపోవడంతో చెట్టు కొమ్మలు రోడ్డుపై అలానే ఉన్నాయి. అధికారులు తక్షణమే స్పందించి కొమ్మల తొలగింపునకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. కాగా 22వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్‌పై ఒత్తిడి పెరగడంతో గత ఏడాది ఇక్కడి నుంచి బదిలీపై వేరే వార్డుకు వెళ్లిపోయారు. అప్పటి నుంచి ఎవరూ ఇక్కడ విధులు నిర్వహించడానికి ముందుకు రాలేదు. దీంతో స్థానిక కార్పొరేటర్ సిఫార్సు మేరకు సచివాలయ పారిశుధ్య కార్యదర్శినే ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్‌గా నియమించారు. చెత్త తొలగించాలని కోరిన వారిపై ఆయన దురుసుగా ప్రవర్తిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

గంటాను కలిసిన గృహ నిర్మాణ బోర్డు చైర్మన్



విశాఖపట్నం, అక్టోబరు 6 : ఎంవీపీ కాలనీలో భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును రాష్ట్ర గృహ నిర్మాణ బోర్డు చైర్మన్ బత్తుల తాతయ్యబాబు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. గంటా శ్రీనివాసరావు చోడవరం ఎమ్మెల్యేగా ఉన్నప్పటి నుంచి తాతయ్యబాబుతో మంచి సాన్నిహిత్యం ఉంది. ఈమేరకు రాష్ట్ర గృహ నిర్మాణ బోర్డు చైర్మన్‌గా నియామకం కావడంతో గంటాను కలిశారు. తాతయ్యబాబును గంటా శాలువ కప్పి, సత్కరించారు.

నాయకత్వ లక్షణాలకు ఎన్‌సీసీ శిక్షణ దోహదం


మాట్లాడుతున్న కల్నల్ నీరజ్‌కుమార్

ఎండాడ/సాగర్‌నగర్ అక్టోబరు 6 : ఎన్‌సీసీ క్యాడెట్లలో క్రమశిక్షణ, ఏకాగ్రత, నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు శిక్షణ దోహదపడుతుందని లెఫ్టినెంట్ కల్నల్ నీరజ్ కుమార్ అన్నారు. రుషికొండ గాయత్రి క్యాంపస్ వేదికగా కళాశాల ఎన్‌సీసీ కెప్టెన్ అనంత భాస్కర్ ఆధ్వర్యంలో ఉత్తరాంధ్రకు చెందిన త్రివిధ దళాల ఎన్‌సీసీ క్యాడెట్ల వార్షిక శిక్షణ శిబిరాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శిక్షణలో క్యాడెట్లకు శారీరక దారుఢ్యం, ఆత్మవిశ్వాసంతో నిర్ణయాలు తీసుకునేలా డ్రిల్స్, ఫైరింగ్, క్విజ్ పోటీలు, సాంస్కృతి తదితర కార్యక్రమాలు అందించనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో పలు కళాశాలల ఎన్‌సీసీ ఆఫీసర్లు, ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.